# ధర్మఘంటి

TELTEL/2012/47103

జాతీయ తెలుగు దినపత్రిక

నల్లగొండ | సంపుటి : 12 | సంచిక : 207 | ఎడిటర్ : మేడే శాంతికుమార్ | మంగళవారం 28 అక్టోబర్ 2025 | పేజీలు : 8 | వెల : 1

**Circulated by:** Nalgonda, Hyderabad, Warangal, Ranga Reddy, Medak, Khammam, Adilabad, Nizamabad, Mahabub Nagar, Karimnagar


### వొడాఫోన్ ఐడియాకు సుప్రీంలో భారీ ఊరట

సవరించిన స్థూల ఆదాయం (ఏజీఆర్) బకాయిల లెక్కింపు వ్యవహారంలో ప్రముఖ టెలికాం సంస్థ వొడాఫోన్ ఐడియాకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. 2016-17 వరకు బకాయిల కోసం టెలికాం విభాగం (డాట్) ఇచ్చిన అదనపు పన్ను డిమాండ్‌లపై కంపెనీ చేస్తోన్న అభ్యంతరాలను పరిశీలించేందుకు కేంద్రానికి అత్యున్నత న్యాయస్థానం అనుమతి ఇచ్చింది.

### పసిడి పరుగులకు బ్రేక్..

కొండెక్కిన బంగారం ధరలు ప్రస్తుతం కొండదిగుతున్నాయి. గతవారంలో ఆకాశమే హద్దుగా దూసుకుపోయిన పుత్తడి తిరోగమనబాట పట్టింది. నేడు కూడా బంగారం ధరలు భారీగా తగ్గాయి. సోమవారం ఉదయం ట్రేడింగ్‌లో తులంపై రూ.1,440 తగ్గింది. దీంతో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛమైన 10 గ్రాముల బంగారం ధర రూ.1,24,480కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,050 తగ్గి రూ.1,14,100కి చేరింది.అటు వెండి ధరలు కూడా బంగారంతో సమానంగా దిగొచ్చాయి.

# ఫుల్ జోష్‌లో కేసీఆర్



- కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ ఫాంహౌస్‌కే పరిమితమైన గులాబీ బాస్ కేసీఆర్..
- ముందుగా కేసీఆర్ ఫుల్ యాక్టీవ్‌గా కనిపించడమే లీడర్లకు ఎక్కడా లేని సంతోషం నింపిందట
- ఇక ప్రజా సమస్యలు, జూబ్లీహిల్స్‌లో ఉన్న పరిస్థితులపై కేసీఆర్ మాట్లాడిన మాటలు కూడా నేతలను అరటాక్ట్ చేశాయట
- వచ్చేసారి అధికారం మనదే అని కాన్ఫిడెన్స్‌తో ఉన్నారని లీడర్లు తెగ హ్యాపీ అయిపోయారట

హైదరాబాద్

సార్ ఫుల్ జోష్‌లో కనిపిస్తున్నారు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ ఫాంహౌస్‌కే పరిమితమైన గులాబీ బాస్ కేసీఆర్.. జూబ్లీహిల్స్ బైపోల్‌పై పార్టీ నేతలతో సమీక్ష నిర్వహించారు. ఈ మీటింగ్‌కు పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు.. ముఖ్య నేతలంతా అటెండ్ అయ్యారు. ప్రతి ఒక్కరితో నవ్వుతూ మాట్లాడుతూ.. అందరి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారట గులాబీ బాస్. అంతేకాదు రివ్యూ మీటింగ్‌లో కేసీఆర్ మాట్లాడిన తీరు కూడా లీడర్లలో ఫుల్ కాన్ఫిడెన్స్ నింపిందట. ముందుగా కేసీఆర్ ఫుల్ యాక్టీవ్‌గా కనిపించడమే లీడర్లకు ఎక్కడా లేని సంతోషం నింపిందట. ఇక ప్రజా సమస్యలు, జూబ్లీహిల్స్‌లో ఉన్న పరిస్థితులపై కేసీఆర్ మాట్లాడిన మాటలు కూడా నేతలను అరటాక్ట్ చేశాయట. ఫాంహౌస్‌లో ఉన్నప్పటికీ సార్ ప్రతీ అంశాన్ని నిశితంగా గమనిస్తున్నారని.. వచ్చేసారి అధికారం మనదే అని కాన్ఫిడెన్స్‌తో ఉన్నారని లీడర్లు తెగ హ్యాపీ అయిపోయారట. ఈ క్రమంలోనే అనారోగ్యం నుంచి కేసీఆర్ పూర్తిగా కోలుకున్నట్లు చెబుతున్నారు బీఆర్ఎస్ ముఖ్యనేతలు. ఎర్రవెల్లి ఫాంహౌస్‌లో నిర్వహించిన జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సన్నాహక సమావేశంలో గులాబీ బాస్ చాలా యాక్టీవ్‌గా కనిపించారని అంటున్నారు లీడర్లు. మీటింగ్‌కు వచ్చిన వారందరిని పేరు పేరునా పలకరించారట. రాష్ట్రంలోని తాజా - మిగతా 3లో



## రెండేళ్లు అయిపోయాయి.. ఇంకో మూడేళ్లలో చేసేది ఏమీ ఉండదు

- కాంగ్రెస్ సర్కారుపై కేటీఆర్ సెటైర్లు..
- పొరపాట్లు చేసి ఉంటే చేసుండొచ్చు..
- తెలంగాణ బుల్డోజర్ రాజ్యంపై రాహుల్ ఎందుకు సైలెంట్‌గా ఉన్నడు?
- మోదీ చట్టాలను బీజేపీ పాలిత రాష్ట్రాల కంటే.. రేవంత్ త్వరగా అమలు చేస్తడు

హైదరాబాద్

పెద్ద పెద్ద లీడర్లను తీసుకొచ్చిక్కడ కాంగ్రెస్ మైనార్టీ డిక్లరేషన్ ప్రకటించిందని.. మార్పు తెస్తాం అంటూ ప్రచారం చేసిందని కాంగ్రెస్ సర్కారుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు వ్యంగ్యస్త్రాలు సంధించారు. రెండేళ్ల క్రితం మైనార్టీల కోసం 4వేల కోట్ల బడ్జెట్ పెడతామన్నారనని.. మైనార్టీ సబ్ ప్లాన్ కూడా తెస్తామని చెప్పి కాంగ్రెస్ మాట తప్పిందని.. రెండేళ్లు అయిపోయాయి.. ఇంకో - మిగతా 3లో

## రైతులకు నష్టం జరగకుండా పంటలు కొనుగోలు చేయాలి

- ధాన్యం, పత్తి, మొక్కజొన్న కొనుగోళ్లపై అప్రమత్తంగా ఉండాలి
- పత్తి అమ్మకాల విషయంలో రైతులు నాణ్యత, తేమ శాతాన్ని దృష్టిలో పెట్టుకోవాలి
- పత్తిలో తేమ 12 శాతానికి మించకుండా చూసుకోవాలి



హైదరాబాద్

తెలంగాణకు వర్ష సూచన దృష్ట్యా రైతులకు నష్టం కలగకుండా పంటలు కొనుగోలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ధాన్యం, పత్తి, మొక్కజొన్న కొనుగోళ్లపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సీఎం ఆదేశాలతో సాయంత్రం కలెక్టర్లతో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. పంటల కొనుగోళ్లకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి వివరించనున్నారు.

పత్తి అమ్మకాల విషయంలో రైతులు నాణ్యత, తేమ శాతాన్ని దృష్టిలో పెట్టుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. పత్తిలో తేమ 12 శాతానికి మించకుండా చూసుకోవాలని సూచించారు. అంతకు మించితే కనీస మద్దతు ధర పొందే అవకాశం ఉండదన్నారు. కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ చౌహాన్‌కు లేఖ రాశామని.. పత్తి రైతులకు గరిష్ఠ మద్దతు ధర అందించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు.




## 12 రాష్ట్రాలలో ఎస్ఐఆర్ రెండో దశను ప్రారంభిస్తాం

- కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్
- 1951నుంచి 2004 వరకు ఎనిమిది సార్లు ఎస్ఐఆర్ నిర్వహించారు
- 21ఏళ్ల తర్వాత మళ్లీ ఎస్ఐఆర్ విజయవంతంగా పూర్తి చేస్తున్నాం.
- బిహార్‌లో ఎస్ఐఆర్‌పై ఎవరు అభ్యంతరాలు చెప్పలేదు
- త్వరలో రెండో దశలో 12 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎస్ఐఆర్ నిర్వహిస్తాం.

## తెలంగాణలో గన్ కల్చర్ పెరుగుతోంది

- కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసుల కాళ్లు పట్టుకునే దుస్థితికి తీసుకొచ్చింది
- రైతులు పండించిన పంటను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలి
- జూబ్లీహిల్స్‌లో పోటీ మజ్లిస్- భాజపా మధ్యే
- "జూబ్లీహిల్స్‌లో మజ్లిస్-భాజపా మధ్యే పోటీ ఉంటుంది
- ప్రజలు భాజపాకు ఓటేయకుంటే మజ్లిస్ సీట్లు 8 అవుతాయి



## కొత్త సీజేఐగా సూర్యకాంత్



- తదుపరి సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ పేరును ప్రతిపాదించిన సీజేఐ బీఆర్ గవాయ్
- సుప్రీంకోర్టులో అత్యంత సీనియర్ న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ సూర్యకాంత్..
- 2001 మార్చిలో ఆయన సీనియర్ న్యాయవాదిగా నియమితులయ్యారు

## డిజిటల్ అరెస్ట్.. అత్యంత భయంకరమైన ముప్పు

- డిజిటల్ అరెస్టును ప్రజలకు ఉన్న అత్యంత భయంకరమైన ప్రమాదాల్లో ఒకటిగా
- ఇటువంటి వాటిని ఎదుర్కోవాలంటే సైబర్ నేరాలపై ప్రజలకు పోలీసులు సరైన అవగాహన కల్పించాలి
- పోలీసుల పట్ల ప్రజలకు భయం ఉండకూడదని, వారు తమకు రక్షణగా నిలుస్తారనే గౌరవం ఉండాలి
- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము



## సంపాదకీయం

# అప్పు చేసి పప్పుకూడు ? తెలుగు రాష్ట్రాల ప్రజల స్టైల్

తెలంగాణ– ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి 11 ఏళ్లుపూర్తయింది. తెలంగాణ మిగులు బడ్జెట్ రాష్ట్రంగా ఏర్పడగా, ఆంధ్రప్రదేశ్ అప్పులు, కుప్పలు లేని రాష్ట్రంగా ఏర్పడింది. ఈ రెండు రాష్ట్రాలు దేశంలో అప్పుల భారం ఎక్కువగా ఉన్న తొలి స్థానాల్లో నిలిచాయి.ఏది కావాలన్నా ముందు అప్పు చేసెయ్ అన్నట్లుగా మారిపోయింది తెలుగు రాష్ట్రాల ప్రజల లైఫ్ స్టైల్. దేశంలోనే అత్యధికంగా అప్పులు చేస్తున్న ప్రజల్లో తెలుగు రాష్ట్రాల ప్రజల ముందున్నారు. 2020–21 లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో 43.7% మంది, తెలంగాణలో 37.2% మంది అప్పుల్లో ఉన్నారు. కేంద్ర గణాంకాల శాఖ తాజాగా విడుదల చేసిన సర్వే లో ఈ విషయం వెల్లడి అయింది. ఏపీ 1వ స్థానం, తెలంగాణ 2వ స్థానాల్లో నిలిచాయి. అయితే, ఫైనాన్షియల్ ఇన్క్లూజన్లో ఏపీ 92.3% తో రెండో స్థానంలో, కర్ణాటక 95.9% తో మొదటి స్థానంలో ఉంది. తెలంగాణలో 86.5% మంది మాత్రమే ఫైనాన్షియల్ ఇన్క్లూజన్ పరిధిలోకి చేరారు. ఈ విధంగా, దేశంలోని పెద్ద రాష్ట్రాల్లో తెలంగాణ 14వ స్థానంలో ఉంది. సామాజిక వర్గాల వారీగా పరిశీలిస్తే, ఓబీసీలులో 16.6% మంది అప్పుల ఊబిలో ఉంటే, గిరిజనులులో 11% మాత్రమే అప్పుల భారం తేలిందని నివేదిక పేర్కొంది. కుటుంబం పెద్దదైనా, చిన్నదైనా అప్పుల భారం వేరుగా ఉంటుంది. చిన్న కుటుంబాలు ఎక్కువ అప్పుల భారం మోస్తున్నాయి, పెద్ద కుటుంబాలపై అప్పుల ప్రభావం తక్కువగా ఉంది. దక్షిణాది రాష్ట్రాల్లో సగటున 92.1% మంది ఫైనాన్షియల్ ఇన్క్లూజన్ పరిధిలో ఉండగా, 31.8% మంది అప్పుల ఊబిలో చిక్కుకున్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో పరిస్థితి తక్కువ, 80.2% మంది ఫైనాన్షియల్ ఇన్క్లూజన్ పరిధిలో ఉండగా, 7.4% మందికే అప్పుల భారం ఉంది.హైదరాబాద్‌ను పదేళ్లు ఉమ్మడి రాజధానిగా ప్రకటించిన ఆంధ్రప్రదేశ్‌కు పెద్దగా ప్రయోజనం కలగలేదు. తెలంగాణ మాత్రం హైదరాబాద్ రాజధాని కారణంగా భారీగా ఆదాయం పొందుతోంది. ఇక ఏపీ రాజధాని లేని రాష్ట్రంగానే మిగిలిపోయింది. అయితే 11 ఏళ్లలో పాలకులు రాష్ట్రాల అభివృద్ధి, సంక్షేమ పథకాల పేరుతో చేసిన అప్పులతో ఇప్పుడు రెండు రాష్ట్రా?టలు అప్పుల ఊబిలో కూరుకుపోయాయి. ఇదే సమయంలో తెలుగు ప్రజలు కూడా అప్పుల భారంతో ఇబ్బంది పడుతున్నారు. ఆర్థిక వెసులుబాటు ఉన్నా అప్పులు కూడా పెరుగుతన్నాయి. కేంద్ర గణాంకాల శాఖ తాజాగా విడుదల చేసిన సర్వే ప్రకారం తెలుగు రాష్ట్రాలు దేశంలో అత్యధికంగా అప్పులు ఉన్న రాష్ట్రాలుగా మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి. 2020?21 లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో 43.7% మంది, తెలంగాణలో 37.2% మంది అప్పుల్లో చిక్కుకున్నట్లు నివేదిక చెబుతోంది. ఆంధ్రప్రదేశ్ దేశవ్యాప్తంగా మొదటి స్థానంలో ఉండగా, తెలంగాణ రెండోస్థానంలో నిలిచింది.ఏపీలో 15 ఏళ్లు పూర్తి చేసిన ప్రజలలో 92.3% మంది బ్యాంకింగ్ వ్యవస్థతో అనుసంధానమై ఉన్నారు. ఇది కర్ణాటక (95.9%) తర్వాత రెండవ ఉత్తమ స్థాయి. అయితే కర్ణాటకలో అప్పుల శాతం కేవలం 23.2% మాత్రమే ఉంది. అంటే, బ్యాంకింగ్ చేరిక పెరగడం అప్పు భారాన్ని తగ్గించలేదని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. ఇక తెలంగాణలో 86.5% మంది మాత్రమే ఫైనాన్షియల్ ఇంక్లూజన్ పరిధిలో ఉన్నారు. దేశంలోని ప్రధాన రాష్ట్రాలలో 14వ స్థానంలో ఉంది.దక్షిణ రాష్ట్రాల సగటు ప్రకారం 92.1% మంది జనాభా బ్యాంకింగ్ వ్యవస్థలో భాగమయ్యారు. కానీ వారిలో 31.8% మంది అప్పుల బారిన పడినవారే. అంటే ఆర్థిక చేరికతోపాటు వడ్డీ ఆధారిత జీవనశైలి బలపడుతున్న సంకేతమిది. దీని విరుద్ధంగా ఈశాన్యరాష్ట్రాల్లో పరిస్థితి కొంత మెరుగ్గా ఉంది. అక్కడ 80.2% మంది మాత్రమే ఫైనాన్షియల్ ఇంక్లూజన్ పరిధిలో ఉన్నప్పటికీ, అప్పుల శాతం కేవలం 7.4% మాత్రమే.సర్వే ప్రకారం.. బ్యాంకింగ్ చేరికలో పురుషులు (89.8%) ముందంజలో ఉండగా మహిళలు (84.5%) వెనుకబడ్డారు. మతపరంగా చూస్తే హిందువులలో 88.1% ఫైనాన్షియల్ ఇంక్లూజన్ కలిగి ఉండగా, ముస్లింలు 80.8% వద్ద ఆగిపోయారు. ఈ వ్యత్యాసం సామాజిక ఆర్థిక అవగాహనలో, ఆదాయ అవకాశాల్లో ఉన్న అసమానతలను చూపుతోంది. అప్పుల విషయంలో ఓబీసీలు (16.6%) ప్రధానంగా బరువును మోస్తుండగా, గిరిజనులు (11%) తక్కువగా ఉన్నారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు తమ సేవల్ని విస్తృత పరిచాయి. యాప్స్ ద్వారా లోన్లు ఇస్తున్నాయి. బజాజ్ ఫైనాన్స్ వంటి సంస్థల మార్కెట్ తెలుగు రాష్ట్రాల్లో చాలా ఎక్కువ.చాలా ఈజీగా లోన్లు ఆఫర్ చేస్తూంటారు. అందుకే ఎక్కువ మంది కట్టగలమా లేదా అన్న ఆలోచన లేకుండా అప్పులు చేస్తున్నారు. చివరికి వారిని రుణాల ఊబిలోకి దింపుతోంది. నిజానికి ఇవన్నీ బ్యాంకుల అప్పుల లెక్కలే. ప్రైవేటు అప్పుల లెక్కలు రికార్డులకు రావు. అందుకే ఈ అప్పుల కన్నా చాలా ఎక్కువగా రుణభారం ప్రజలపై ఉంటుంది. ఉత్తరాదిలో .. బ్యాంకింగ్ ఇంక్లూజన్ తక్కువ కాబట్టి అక్కడి ప్రజల అప్పులు రికార్డుల్లోకి రాలేదు. అక్కడి ప్రజలు తెలుగు రాష్ట్రాల ప్రజల కన్నా ఇంకా ఎక్కువ అప్పుల భారంలో ఉంటారని సులువుగానే అర్థం చేసుకోవచ్చు.కుటుంబ పరిమాణం ఆధారంగా చూస్తే, పెద్ద కుటుంబాల కన్నా చిన్న కుటుంబాలపై అప్పుల ఒత్తిడి ఎక్కువగా ఉంది.ఫైనాన్షియల్ ఇంక్లూజన్ వృద్ధి శుభ సూచకం అయినప్పటికీ, ఆర్థిక విద్య, పొదుపు సంస్కృతి లేకపోతే అది అప్పు భూతాన్ని తగ్గించలేదని ఈ నివేదిక స్పష్టం చేస్తోంది. ప్రభుత్వాలు, బ్యాంకులు కలిపి పొదుపు, పెట్టుబడి దిశలో అవగాహన పెంచితేనే ఆర్థిక స్థిరత్వం సాధ్యమవుతుంది. లేకుంటే తెలుగు ప్రజల అప్పులు మరింత పెరిగే ప్రమాదం ఉంది.

# చందమామతో కొడవటిగంటి అనుబంధం

దాదాపు ముప్పై సంవత్సరాలుగా "చందమామ" సంపాదక వర్గంలో ముఖ్యుడిగా వుంటూ, 'చంద మామ' అభివృద్ధికి దోహదం చేసిన సుప్రసిద్ధ రచయిత కొడవటిగంటి కుటుంబరావు. "చందమామ'ను అభిమానించే అసంఖ్యాక పాఠకులు, అభిమానుల హృదయాలలో చిరస్థాయిగా ఆయన నిలిచి పోయారు. కథకుడుగా, విమర్శకుడిగా, వ్యాస, నవలా రచయితగా ఆయన సాధించిన ఖ్యాతి తెలుగు పాఠక లోకానికి సుపరిచితమే. 'చందమామ'లో ఎవరు ఏ కథ రాసినా, ఆ కథకు మెరుగులు దిద్ది, అందం తెచ్చి, చదివింప జేసిన ఘనత ఆయనది. తన అనుభ వాన్ని రంగరించి, సులభ భాషలో చందమామ పాఠకులకు ఆయన అందించిన వేలాది కథలు బాల సాహిత్యంలో ఆణి ముత్యాలు. చక్రపాణి ఆశయాలను సాకారం చేసి, చందమామకు ప్రత్యేకత కల్పించి, తన ప్రతిభతో పాఠక లోకాన్ని తక్కిన పత్రికలను కాదని చందమామ వైపు ఆకర్షింప చేసిన మేధావి కొడవటిగంటి. తెలుగు రచయితల్లో సుప్రసిద్ధ చెందిన వారిలో కొడవటిగంటి కుటుంబరావు ఒకరు. సమకాలీన మానవ జీవితాన్ని సునిశి తంగా పరిశీలించి తన రచనలతో సహజత్వాన్ని సుసంపన్నం చేసిన సాహితీవేత్త ఆయన. తెలుగు మధ్య తరగతి కుటుం బాలను (కొంత ఎక్కువగా బ్రహ్మణ కుటుంబాలను) నిశితంగా పరిశీలించి వాటికి సంబంధించి ఎన్నో ఇతివృత్తాలను తన కథల్లోకి ఆయన తీసుకొన్నారు. జాతకాలు – వాటి ప్రభావా లు, మత పరమైన మూఢ విశ్వాసాలు, పిల్లల్ని పెంచటంలో పెద్దవాళ్ళ మూర్ఖత్వాలు, సామాజిక స్పృహ లేని వ్యక్తులు, మధ్య తరగతి మానవ సంబంధాలు, ముఖ్యంగా స్త్రీ – పురుష సంబంధాలు, అందులో దాంపత్యేతర సంబంధాలు ఆయన రచనల్లో ప్రధాన వస్తువులు. కొడవటి గంటి కుటుంబరావు (1909 అక్టోబర్ 28 – 1980 ఆగష్టు 17), ప్రసిద్ధ తెలుగు రచయిత, హేతువాది. "కొకు" గా చిరపరిచితు డైన ఆయన తన యాభై ఏళ్ళ రచనా జీవితంలో పది వేల పేజీలకు మించిన రచనలు చేసాడు. చందమామ పత్రికను తీర్చిదిద్దిన ప్రముఖులలో ఆయన అగ్రగణ్యులు. కుటుంబరావు గుంటూరు జిల్లా, తెనాలి లోని ఒక మధ్య తరగతి బ్రాహ్మణ కుటుంబంలో జన్మిం చారు. తెనాలిలో పాఠశాల చదువు 1925 వరకు సాగింది. చిన్న వయసులోనే 1914లో తండ్రీ, 1920లో తల్లీ మరణించడంతో మేనమామ వద్ద పెరిగారు.



ఆయన చిన్నతనం గ్రామీణ జీవితంతో పెనవేసుకు పోయింది. కవీ, రచయితా అయిన అన్నయ్య వెంకట సుబ్బయ్య ద్వారా ఆయన సాహితీ రంగ ప్రవేశం జరిగింది. ఆ కాలంలోనే ఆయనకు పాశ్చాత్య సాహిత్య పరిచయం జరిగింది. పదమూడేళ్ళ లేత వయసులోనే కొన్ని పద్యాలు, ఒక అసంపూర్ణ థ్రిల్లరు నవలా రాసారు. కొద్ది కాలం లోనే వాటిని వదిలి పెట్టారు.1925లో ఉన్నత విద్య పూర్తికాక ముందే 11 ఏళ్ళ పద్మావతితో ఆయన పెళ్ళి జరిగింది.1925 నుండి 1927 వరకు గుంటూరు ఆంధ్రా క్రిస్టియన్ కళాశాలలో ఇంటర్మీడియేటు చదివాక, 1927–29 కాలంలో మహారాజా కళాశాల, విజయ నగరంలో బియ్యే ఫిజిక్సు చదివారు. ఈ కాలంలోనే రచనా వ్యాసంగాన్ని సీరియస్ గా మొదలు పెట్టాడు. బియ్యే చివరికి వచ్చేసరికి ఆయన నాస్తికునిగా మారిపోయారు. 1929లో కాశీ హిందూ విశ్వ విద్యాలయంలో ఎం.ఎస్.సి ఫిజిక్సులో చేరారు. 1930లో ఆయన తొలిరచన సినిమా ఓరియంటల్ వీక్లీలో ప్రచురిత మైంది. ఆయన మొదటి కథ ప్రాణాధికం గృహలక్ష్మి మాస పత్రికలో అగ్రస్థానం పొందింది. కారణాంతరాల వల్ల ఎం.ఎస్.సి రెండో సంవత్సరం చదువు ఆగిపోయింది. 1931లో కొంతకాలం పాటు వరంగల్ లో ఉండి పిల్లలకు ప్రైవేట్లు చెప్పారు. చక్రపాణి, పిల్లలమర్రి బాలకృష్ణ శాస్త్రి, పిల్లలమర్రి సాంబశివ రావులతో కలిసి యువ ప్రెస్‌ను స్థాపించి యువ పత్రికను ప్రారంభించారు. 1940 – 42 మధ్య కాలంలో ఆంధ్ర పత్రికలో పని చేసారు. ఆ సమయంలో జరుక్ శాస్త్రి (జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి) ఆయనకు సహోద్యోగి. 1942 లో నాలుగు నెలల పాటు ఒక మెటలు కర్మాగారంలో పని చేసారు. 1942 జూలై నుండి 1943 జనవరి వరకు సిమ్లాలో జాతీయ యుద్ధ ప్రచారక సమితిలో కాపీ రైటరుగా పనిచేసారు. 1944లో ఒడిషా జయపూరులో ఇన్స్పెక్టరేట్ ఆఫ్ మెటల్ అండ్ స్టీల్‌లో ఆర్నెల్ల పాటు ఫోర్మనుగా పనిచేసారు. 1948లో మూణ్ణెల్ల పాటు బొంబాయి ఎయిర్ ఇండియా కార్యాలయంలో ఎకౌంట్సు క్లర్కుగా పనిచేసారు. 1948లో ఆంధ్రపత్రిక దినపత్రికలో చేరి 1950–51లో వారపత్రిక సంపాదకత్వం నిర్వహించారు. జగత్తులో స్థలము, కాలము అనే రెండు కొలతలే కాకుండా బుద్ధి అనేది కొలతగా పనిచేస్తుంది అనే సిద్ధాంతాన్ని... బుద్ధికొలత వాదం అనే పేరుతో ఆయన ప్రతిపాదిం చారు. ఈ ప్రతిపాదన అనేక చర్చలకు దారితీసింది. 1937లో రాసిన ఆయన రచన కారుణ్యం ముందు మాటలో... నాకు ఒకటే ఆశయం – నా రచనల వల్ల కూడా మనోవికాసం పొంద దగిన వాళ్ళు తెలుగు వాళ్ళలో ఉండి తీరాలి. వారందరూ నా కథలు చదవాలని నా కోరిక. వారందరికీ నా రచనల మీద ఎంత త్వరగా ఏవగింపు కలిగితే అంత ఉపయోగం చేసిన వాణ్ణవుతాను తెలుగు సారస్వతానికి. అప్పటికి తెలుగు సారస్వతానికి నాతో పని అయిపోతుంది. నా కథలు చిరస్థాయిగా ఉండిపోవాలనే ఆశ నాకు ఏకోశానా లేదు. ఇంకా ఎప్పుడో పుట్టబోయే వాళ్ళ కోసం రాస్తున్నాననే అహంకారం కూడా నాకు లేదు. నేను ఆకాశం నుంచి ఊడిపడలేదు... అని తన మనసు లోని మాటను స్పష్టం చేశారు. 1952, జనవరి 1 నుండి చనిపోయే వరకూ చందమామలో పనిచేసి ఆ పత్రిక అత్యున్నత స్థితికి రావటానికి నిర్విరామ కృషి సలిపారు.

# యానిమేషన్‌తో ప్రతిసృష్టి

మనకు సుపరిచితమైన స్పైడర్ మాన్, మిక్కీ మౌస్, డొనాల్డ్ డక్, టామ్ అండ్ జెర్రీ, ఫిలిమ్ అవతార్, బాహుబలి సినిమా, పౌరాణిక గాథల ఆనిమేషన్ చిత్రాలు లాంటి పాత్రల ప్రభావం మన మనసుల్లో సుస్థిరంగా నాటుకున్నాయి. షార్ట్ వాణిజ్య ప్రకటనలతో మ్నెదలు పూర్తి నిడివిగల చలన చిత్రాల వరకు ఆనిమేషన్ కళకు సృజన జోడించి వినియోగించే స్థాయికి టెక్నాలజీ చేరడం సంతోషదాయకం. సమాజ శ్రేయస్సు కోరే పలు అంశాలను ఆనిమేషన్ కళలో ప్రత్యేకతలుగా, సరళంగా, స్పష్టంగా, అర్థవంతంగా, ఆకర్షణీయంగా తక్కువ సమయం లో గొప్ప భావాలను వ్యక్తం చేయవచ్చు. అక్టోబర్ 1892లో తొలి సారి పారిస్‌లో ఆనిమేషన్ చిత్రం ప్రదర్శించడం జరిగింది. దీనికి గుర్తుగా ఆనిమేషన్ కళకు పెరిగిన అపార ఆదరణను దృష్టిలో ఉంచుకొని వాణిజ్య, చలనచిత్రరంగాల్లో దాని ప్రాముఖ్యతను వివరించే సదుద్దేశ్యంతో "ఇంటర్నేషనల్ ఆనిమేటెడ్ ఫిలిమ్ అసోసియేషన్" నేతృత్వంలో 2002 నుండి ప్రతియేటా 28 అక్టోబర్ రోజున 'అంతర్జాతీయ ఆనిమేషన్ దినోత్సవం (ఇంటర్నేషనల్ ఆనిమేషన్ డే)' పాటించుట జరుగుచున్నది. ఆనిమేషన్ కళకు సృజనను జోడించి నూతన త్వాన్ని ఆపాదించడం, ఆనిమేషన్ కళ వైపుకు యువతను ఆకర్షించడం, ఆనిమేషన్‌లో వినూత్న భావాలను జోడించడం, ఆనిమేషన్ ఆర్ట్ గూర్చి కార్యశాలలు నిర్వహించడం, ప్రఖ్యాత ఆనిమేషన్ ఫిలిమ్‌లను ప్రదర్శించడం, ఆనిమేషన్ కళ వెనుక దాగిన వైజ్ఞానికశాస్త్రాన్ని వివరించడం, ఆనిమేషన్ కళలో నిష్ణాతులను సన్మానించడం లాంటి అంశాలను చర్చించేందుకు అంతర్జాతీయ ఆనిమేషన్ దినోత్సవ వేదికలను వినియోగించుకుంటారు. ప్రపంచవ్యాప్తంగా ఆనిమేషన్ ప్రక్రియకు విద్య, వినోదం, వాణిజ్యం, మార్కెటింగ్, శాస్త్రీయ అవగాహన, సృజనశీల కళ, గేమింగ్, సిమ్యులేషన్, సినిమా, షార్ట్ ఫిల్మ్, మెడికల్, రిటైల్, ఆర్కిటెక్చర్, ఇంజనీరింగ్, మాన్యుఫాక్చరింగ్ లాంటి రంగాల్లో అనంతమైన అవకాశాలు, ప్రయోజనాలు ఉన్నాయి. నిజ జీవితాన్ని నకలు చేస్తూ బోమ్మల కదలికలతో చిత్రాలు తీయడాన్ని ఆనిమేషన్ నైపుణ్య కళ అంటారు. వాస్తవికతకు ఊహను జోడించి అందరికీ అర్థం అయ్యేలా సరళ, వినోదాత్మక చిత్రాల ద్వారా సందేశాన్ని ఇవ్వడం ఆనిమేషన్ ప్రత్యేకత. స్వల్ప వ్యవధిలో అధిక ప్రభావం చూపగల సామర్థ్యం ఆనిమేషన్ కళకు ఉంటుంది. ఆనిమేషన్‌లో సంప్రదాయ, 2డి, 3డి, మోషన్ గ్రాఫిక్స్, స్టాప్ మోషన్, కటౌట్ అండ్ కల్లాజ్, రోటోస్కోపింగ్, సెల్ ఆనిమేషన్ మ్నెదలగు రకాలు ఉన్నాయి. సాధారణ జనాలతో కాకుండా వ్యాపారవర్గాలలో కూడా ఆనిమేషన్ కళ ప్రధాన భూమికను నిర్వహిస్తున్నది. డిజిటల్ విప్లవం, అంతర్జాల ప్రభంజనం నేపథ్యంలో ఆనిమేషన్ కళకు అపార ఆదరణ లభించింది. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, ముఖ్యంగా సినిమాలు, టివీల్లో ఆనిమేషన్ కళ ప్రవేశంతో ఆ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకున్నాయు. అన్ని వర్గాల, వయసుల ప్రజలను ఆనిమేషన్ కళ ఆకర్షిస్తున్నది. ఆనిమేషన్ వీడియోలతో సందేశాలను సులభంగా ఇవ్వడం, ఊహాత్మక పరిధికి అవధులు లేక పోవడంతో సృజనశీలత పెరగడం, వైద్యరంగంలో వినియోగపడడం, ఆకర్షనీయంగా ఉండడం, సులభంగా అవగాహనకు రావడం, వాణిజ్య ప్రకటనలతో ఆకర్షించడం, తేలికగా వేగంగా ప్రజలకు చేరడం, కంటికి ఇంపైన రంగుల చిత్రాలు తీయగలగడం లాంటి ప్రయోజనాలు అనేకం ఉన్నాయి. 1906లో స్టువార్ట్ బ్లాక్టన్ మ్నెదటి ఆనిమేషన్ చిత్రం 'హ్యూమరస్ ఫేజెస్ ఆఫ్ ఫన్నీ ఫేసెస్' తీయడం జరిగింది. 1928లో వాల్ట్ డిస్నీ 'స్టీంబోట్ విల్లి' అనబడే ప్రథమ ఆనిమేటెడ్ కార్టూన్ ఫిల్మ్ తీయడం జరిగింది. 1937లో మ్నెదటి పూర్తి నిడివిగల ఆనిమేటెడ్ 'స్నోవైట్' అనే చలనచిత్రాన్ని వాల్ట్ డిస్నీ తీశారు. 1993లో 3డి ఆనిమేషన్ సాఫ్ట్ వేర్ అందుబాటులోకి వచ్చింది. ఆధునిక డిజిటల్ యుగపు యువత ఆనిమేషన్ కళ పట్ల ఆసక్తిని పెంచుకొని, ఆ రంగాన్ని తమ వృత్తిగా ఎంచుకొని, మరింత సృజనను జోడించి ప్రపంచ మానవాళికి నవ్య ఆనిమేషన్ దృశ్య రుచులను చూపుతారని ఆశిద్దాం.

# నిబద్ధతకు నిలువుటద్దం రాఘవాచారి

నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి, విలువలు, నిబద్ధతతో కూడిన జర్నలిజానికి మారుపేరుగా నిలిచిన పాత్రికేయులు, సంపాదకులు చక్రవర్తుల రాఘవాచారి. నిరంతరం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎనలేని సేవలు చేశారు. రాఘవాచారి స్వస్థలం వరంగల్ జిల్లా పాలకుర్తి మండలం శాతాపురం. 1939 సెప్టెంబరు 10న ఆయన జన్మించారు. నిబద్ధతత, విలువలతో కూడిన జర్నలిజానికి మారుపేరుగా నిలిచారు. తెలుగు పబ్లిక్ రచయితల్లో నిరుప మానమైన మేధావి చక్రవర్తుల రాఘవాచారి, తెలుగు, ఇంగ్లీష్ సంస్కృత భాషల్లో పండితులు. పాత్రికేయుడు, సీనియర్ జర్నలిస్ట్. 1972 నుండి 2005 వరకు విశాలాంధ్రలో సంపాదకుడిగా పనిచేశారు. ఆయన మూర్తీభవించిన నిజాయితీ పరుడు. ఆయన వృత్తిలోనూ, వ్యక్తిగత జీవితంలోనూ ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. సాంప్రదాయక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. అయిదో ఏటి నుంచి ప్రబంధాలు, ప్రాచీన కావ్యాలు రామాయణ మహా భారతాలు చదివారు. ఆయనకు ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ నేర్పడానికి ముగ్గురు ఉపాధ్యాయులను నియ మించారు. సంస్కృతం నేర్చు కోవడానికి ఆయనను ఆంధ్ర ప్రాంతంలోని పొన్నూరు పంపించారు. వరంగల్ జిల్లా పాలకుర్తి మండలం శాతా పురం గ్రామంలో జన్మించిన రాఘవాచారి సికింద్రాబాద్ సమీపంలోని లాలాగూడ రైల్వే పాఠశాలలో 11వ ఏట అయిదో తరగతిలో చేరారు. 1953 నుంచి విశాలాంధ్ర చదవడం ప్రారంభించారు. నిజాం కళాశాలలో పి.యు.సి.లో చేరి, ఉస్మానియా విశ్వవిద్యాలయం 6వ ర్యాంకు సాధించారు. ఉస్మానియా విశ్వ విద్యాలయం ఇంజనీరింగ్ కాలేజీలో చేరారు. కానీ ఇంజనీరింగు రెండో సంవత్సరంలోకి వచ్చేటప్పటికి ఆయనకు చదువు మీద ఆసక్తి తగ్గింది.



వరంగల్ వెళ్లి బీఎస్సీలో చేరారు. కమ్యూనిస్టు పార్టీ అనుబంధ విద్యార్థి సంఘంలో చేరారు. కళాశాల విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి పదవికి పోటీ చేసి అద్భుతమైన మెజారిటీతో గెలిచారు. పట్టభద్రుడైన తరువాత హైదరాబాద్ వచ్చి న్యాయశాస్త్రం చడివారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య ప్రతినిధిగా లా కళాశాల విద్యార్థి సంఘం అధ్యక్ష స్థానానికి పోటీ చేశారు. అప్పుడు విశ్వ విద్యాలయంలో ఎం.ఎ. ఇంగ్లిష్ చదువుతున్న ఎస్. జైపాల్ రెడ్డి వంటి వారు తీవ్రమైన వ్యతిరేక ప్రచారం చేసినా రాఘవాచారి అఖండ విజయం సాధించారు. న్యాయ శాస్త్రంలో పట్ట భద్రుడైన తరువాత ఎల్.ఎల్.ఎం. చేశారు. 1969–71 మధ్య ఆయన ఢిల్లీ నుంచి వెలువడే వామపక్ష అనుకూల ఇంగ్లీష్ పత్రిక విలేకరిగా పని చేశారు.1971లో ఆయన విజయవాడ వెళ్లి విశాలాంధ్రలో చేరారు. కొద్ది కాలానికే ఆ పత్రికకు సంపాదకుల య్యారు. 28 ఏళ్ల సుదీర్ఘ కాలం విశాలాంధ్ర సంపాదకులుగా ఉన్నారు. ఆయన సంపాదకీయాలు సూటిగా, స్పష్టంగా ఉండేవి. స్పష్టత, సంక్షిప్తత ఆయన శైలి. 'తెలుగు పత్రిక పరిణామం – ప్రయోగాలు – ప్రయోజనం' అన్న వ్యాసంలో తెలుగు పత్రికా రంగంలో వాడే భాషా ప్రామాణీకరణ జరగలేదని విచారం వ్యక్తం చేశారు. విజయ వాడ, ఇతర ప్రాంతాల.లోనూ ఉపన్యాసకుడిగా ఆయనను ఆహ్వానించే వారు. ఆయన మాటల్లో అడుగడుగునా వ్యంగ్యం తొణికిస లాడేది. ఆయన గొప్పవాడిగా కనిపించే ప్రయత్నం ఎన్నడూ చేయలేదు. మేధావిగా ఆయనకు ఎంత గుర్తింపు ఉన్నా ఎనిమిది పదుల వయసు నిండి నాకా, ఆయనతో మాట్లాడిన వారు ఎవరైనా ఆయన జ్ఞాన విస్తృతి చూసి ముచ్చట పడేవారు. నిబద్ధత కలిగి, విలువలకు జీవితాంతం కట్టుబడిన కమ్యూనిస్టుగా విజ్ఞానఖనిగా రాఘవాచారి పేరు గాంచారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా విద్యార్థి ఉద్యమానికి ఆయన అందించిన సేవలు ఎనలేనివి. 30 ఏళ్ల పాటు విశాలాంధ్ర సంపాదకులుగా బాధ్యతలు నిర్వర్తించిన రాఘవాచారి, సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్‌గా, సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ సభ్యులుగా సేవలందించారు. 1972లో విశాలాంధ్ర ఎడిటర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాఘవాచారి 2005 వరకు కొనసాగారు. రాఘవాచారి, హైదరాబాదులోని ఒక హాస్పిటల్‌లో చికిత్సపొందుతూ 2019, అక్టోబరు 28వ తేది తెల్లవారు జామున మరణించారు. తెలుగు పత్రికా రంగానికి ఆయన చేసిన సేవను తెలుగు ప్రజలు ఎప్పుడూ గుర్తించుకునే, ఉదాత్తమైన వ్యక్తిత్వం ఉన్న రాఘవాచారి నిస్సందేహంగా మేధావి.

# కొత్త సీజేఐగా సూర్యకాంత్

**న్యూఢిల్లీ :** భారత సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)గా జస్టిస్ సూర్యకాంత్ పేరు ఖరారైంది. ప్రస్తుత సీజేఐ జస్టిస్ భూషణ్ ఆర్. గవాయ్.. తన వారసుడిగా జస్టిస్ సూర్యకాంత్ పేరును కేంద్ర ప్రభుత్వానికి సోమవారం సిఫారసు చేశారు. దీంతో దేశ 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ నియామకానికి మార్గం సుగమమైంది. జస్టిస్ గవాయ్ నవంబర్ 23న పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో తదుపరి సీజేఐ పేరును సూచించాలని కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ కోరిన మీదట జస్టిస్ గవాయ్ ఈ సిఫారసు చేశారు. సుప్రీంకోర్టులో అత్యంత సీనియర్ న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ సూర్యకాంత్.. నవంబర్ 24న నూతన సీజేఐగా ప్రమాణ స్వీకారం చేస్తారు. ఆయన 2027 ఫిబ్రవరి 9న పదవీ విరమణ చేసేంత వరకు, అంటే సుమారు 14 నెలల పాటు ఈ అత్యున్నత పదవిలో కొనసాగుతారు. 2025 మే నెలలో జస్టిస్ గవాయ్ 52వ సీజేఐగా బాధ్యతలు స్వీకరించారు. సంప్రదాయం ప్రకారం,



సీజేఐ పదవీ విరమణకు నెల రోజుల ముందు న్యాయ మంత్రిత్వ శాఖ తదుపరి వారసుడి పేరును సిఫారసు చేయాలని కోరుతుంది. మెమోరాండం ఆఫ్ ప్రొసీజర్ (ఎంఓపీ) ప్రకారం, సుప్రీంకోర్టులో అత్యంత సీనియర్ న్యాయమూర్తిని సీజేఐగా నియమిస్తారు. జస్టిస్ సూర్యకాంత్ 1962 ఫిబ్రవరి 10న హర్యానాలోని ఓ మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. హిసార్‌లోని ప్రభుత్వ పోస్ట్ గ్రాడ్యుయేట్ కాలేజీ నుంచి 1981లో డిగ్రీ, రోహ్తక్‌లోని మహర్షి దయానంద్ యూనివర్సిటీ నుంచి 1984లో న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. అదే ఏడాది హిసార్ జిల్లా కోర్టులో న్యాయవాదిగా తన ప్రాక్టీసును ప్రారంభించారు. 1985లో చండీగఢ్‌కు మారి పంజాబ్, హర్యానా హైకోర్టులో ప్రాక్టీస్ చేశారు. 2000 జులై 7న హర్యానా రాష్ట్రానికి అత్యంత పిన్న వయస్కుడైన అడ్వొకేట్ జనరల్‌గా రికార్డు సృష్టించారు. 2004 జనవరి 9న పంజాబ్, హర్యానా హైకోర్టుకు శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఆ తర్వాత 2018 అక్టోబర్ 5న హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. జస్టిస్ గవాయ్ సిఫారసుతో కేంద్ర ప్రభుత్వం త్వరలోనే జస్టిస్ సూర్యకాంత్ నియామకంపై అధికారిక నోటిఫికేషన్ జారీ చేయనుంది.

## ఢిల్లీలో కొనసాగుతున్న వాయు కాలుష్యం..

# ఆసుపత్రుల్లో పెరిగిన రోగుల సంఖ్య

దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం రోజురోజుకూ క్షీణిస్తోంది. గాలి నాణ్యత సూచీ ప్రమాదకరస్థాయిలో నమోదవుతోంది. సోమవారం ఉదయం ఢిల్లీ-ఎన్సీఆర్ ప్రాంతంలో వాయు నాణ్యత సూచిక 315గా నమోదైంది.

సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న డేటా ప్రకారం.. అశోక్ విహార్‌లో అత్యధికంగా ఏక్యూఐ 416గా నమోదైంది. ఆ తర్వాత గౌతమ్ పురి వద్ద 415, ఆనంద్ విహార్ వద్ద 366గా గాలి నాణ్యత సూచీ ఉంది. గణేశ్‌పూర్ వద్ద 318, జీటీబీ నగర్‌లో 302, కశ్మీర్ గేట్ ఐఎస్‌బీటీ ప్రాంతంలో 298, యమూర్ విహార్‌లో 287గా ఏక్యూఐ నమోదైంది. ఇవాళ ఢిల్లీలో గరిష్ట ఉష్ణోగ్రతలు 29ీ%జ-31ీజ%గా, కనిష్ట ఉష్ణోగ్రతలు 17ీ%జ-19ీజ%గా నమోదయ్యే అవకాశం ఉందని అంచనా. రాత్రికి ఒకటి లేదా రెండు చోట్ల తేలికపాటి వర్షం పడే అవకాశం ఉందని ఢిల్లీ ఆర్ఎమ్‌సీ అంచనా వేసింది. తీవ్రమైన వాయుకాలుష్యంతో ఢిల్లీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనారోగ్యం బారిన పడుతున్నారు. ఢిల్లీ, నోయిడా, గురుగ్రామ్, ఫరీదాబాద్, ఘజియాబాద్‌లోని ఆసుపత్రుల్లో రోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. శ్వాసకోశ, ఛాతీలో నొప్పి, దగ్గు, గొంతు నొప్పి వంటి సమస్యలతో స్థానికులు ఆసుపత్రులకు వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఎయిర్ క్వాలిటీ అండ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్ అండ్ రిసెర్చ్ నివేదిక ప్రకారం.. గాలి నాణ్యత 447కు పడిపోవడం అంటే దాన్ని తీవ్ర వాయు కాలుష్యంగా పరిగణించవచ్చు. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 0-100 మధ్య ఉంటే గాలి నాణ్యత బాగా ఉండి, కాలుష్యం లేదని, %ూఱ×% 100-200 మధ్య ఉంటే గాలి నాణ్యత మధ్యస్తంగా ఉందని అర్థం. ఇక %ూఱ×% 200-300 మధ్య ఉంటే గాలి నాణ్యత



అధ్వాన్నంగా ఉందని, %ూఱ×% 300-400 మధ్య ఉంటే గాలి నాణ్యత మరింత అధ్వాన్నంగా ఉందని, %ూఱ×% 400-500 మధ్య ఉంటే కాలుష్యం తీవ్ర స్థాయిలో ఉందని అర్థం చేసుకోవచ్చు.

**ఈ నెల 29న కృత్రిమ వర్షం**

ఈ నెల 29న ఢిల్లీలో మొదటిసారిగా కృత్రిమ వర్షాన్ని కురిపించేందుకు ఏర్పాట్లు చేశామని సీఎం రేఖా గుప్తా వెల్లడించారు. బురాయ్‌లో ప్రయోగాత్మక పరీక్ష విజయవంతమైందన్నారు. ఐఐటీ-కాన్పూర్ సహకారంతో ఢిల్లీ ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రాజెక్ట్‌కు ఐఎండీ, ఐఐటీఎమ్-పుణె తోడ్పాటును అందిస్తున్నాయి. దీపావళి తర్వాత పొగ మంచు సీజన్‌లో కాలుష్య కణాలను తగ్గించడానికి వాయువ్య ఢిల్లీలో అయిదు చోట్ల ఈ కృత్రిమ వర్షం కురిపించనున్నారు. ఇందుకోసం డీజీసీపీ అనుమతి పొందారు. సిల్వర్ అయోడైడ్ లేదా సోడియం క్లోరైడ్ లాంటి పదార్థాలను మేఘాల్లోకి విడుదల చేయడం ద్వారా కృత్రిమ వర్షాన్ని కురిపిస్తారు. ఈ వర్షం కారణంగా రాజధాని ప్రాంతంలో గాలి నాణ్యత మెరుగుపడే అవకాశం ఉంది.

# పాక్-అఫ్ఘాన్ ఘర్షణలు.. శాంతి చర్చల్లో ప్రతిష్టంభన

సరిహద్దు వెంబడి ఉగ్రవాద చర్యలకు అడ్డుకట్ట వేసే లక్ష్యంతో పాకిస్థాన్-అఫ్ఘానిస్థాన్ ల మధ్య కొనసాగుతోన్న చర్చల్లో ప్రతిష్టంభన నెలకొంది. భద్రతాపరంగా కీలకమైన అంశాల్లో తాలిబన్ అసంబద్ధంగా వ్యవహరిస్తోందని పాక్ ఆరోపించింది. పాక్-అఫ్ఘాన్‌ల మధ్య దీర్ఘకాలిక శాంతి ఒప్పందం కోసం ఈ రెండు దేశాల మధ్య తుర్కియేలోని ఇస్తాంబుల్‌లో రెండోదశ చర్చలు ప్రారంభమైన సంగతి తెలిసిందే. అయితే ఇరువర్గాల మధ్య సంధి కుదరకపోవడంతో ఈ చర్చలు నిలిచిపోయినట్లు తెలుస్తోంది. ఇస్తాంబుల్‌లో ఈ చర్చలు జరుగుతోన్న సమయంలోనే పాక్-అఫ్ఘాన్ సరిహద్దు మరోసారి భగ్గుమంది. ఆదివారం చోటుచేసుకున్న ఘర్షణల్లో ఐదుగురు సైనికులు ప్రాణాలు కోల్పోయినట్లు పాక్ సైన్యం వెల్లడించింది. మరోవైపు అఫ్ఘాన్ సరిహద్దు నుంచి తమ దేశంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించిన 25 మంది ఉగ్రవాదులను కాల్చిచంపినట్లు పాక్ తెలిపింది. వారిలో నలుగురు ఆత్మాహుతి బాంబర్లు ఉన్నారని పేర్కొంది. ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో ఈ చొరబాటు యత్నాలు జరిగాయని వివరించింది. వీటిని నిరోధించే లక్ష్యంతో జరిపిన ఆపరేషన్లలో భద్రతా దళాలు పెద్ద మొత్తంలో ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నాయి.

**కరాచీ, లాహోర్‌లకు విమాన మార్గాల్లో పాక్ మార్పులు**

ఈ చొరబాట్లతో ఉగ్రవాదాన్ని కట్టడి చేసే విషయంలో అఫ్ఘాన్



తీసుకుంటున్న చర్యలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పాక్ ఆరోపించింది. అయితే ఈ వ్యాఖ్యలపై తాలిబన్ ప్రభుత్వం నుంచి స్పందన రాలేదు. కాగా.. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తున్నారంటూ పాక్ చేస్తోన్న ఆరోపణలను అఫ్ఘాన్ ముందు నుంచి ఖండిస్తోంది. అలాగే తమ సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించేలా పాక్ సైన్యం తీసుకుంటున్న చర్యలను తప్పుపట్టింది.

# రిసార్టులో కరూర్ బాధిత కుటుంబాలకు విజయ్ ఓదార్పు

తమిళ అగ్రనటుడు, టీవీకే అధినేత విజయ్ ఎట్టకేలకు కరూర్ బాధిత కుటుంబాలను కలుసుకున్నారు. సోమవారం మహాబలిపురంలోని ఓ రిసార్ట్‌లో వాళ్లను పరామర్శించి.. ఓదార్చి.. పరిహారం అందజేశారు. ఈ నేపథ్యంతో ఆ పరిసర ప్రాంతాల్లో గట్టి భద్రతను ఏర్పాటు చేశారు. కరూర్ తొక్కిసలాటకు నేటితో సరిగ్గా నెల రోజులు పూర్తైంది. సెప్టెంబర్ 27వ తేదీన టీవీకే ర్యాలీ సందర్భంగా తొక్కిసలాట జరిగి 41 మంది మరణించారు. ఈ ఘటన తీవ్ర విచారం వ్యక్తం చేసిన విజయ్.. బాధిత కుటుంబాలకు టీవీకే తరఫున పరిహారం కూడా ప్రకటించారు. అయితే అప్పటి నుంచి కరూర్ వెళ్లేందుకు ఆయనకు పోలీసుల నుంచి అనుమతి లభించడం లేదు. దీంతో.. దీంతో బాధిత కుటుంబాలనే



మహాబలిపురంలోని ఓ రిసార్ట్‌కు రప్పించారు. బాధిత కుటుంబాల కోసం రిసార్ట్‌లో టీవీకే పార్టీ 50 గదులను బుక్ చేసింది. వాళ్లందరినీ విడివిడిగా కలిసి విజయ్ పరిహారం అందిస్తున్నారు. కరూర్‌లో విజయ్ నిర్వహించిన ర్యాలీలో జరిగిన తొక్కిసలాట దేశవ్యాప్తంగా దిగ్భ్రాంతికి గురిచేసింది ఈ ఘటనకు సంబంధించి టీవీకేకు సంబంధించిన కొందరిని పోలీసులు అరెస్టు చేశారు. తొక్కిసలాట ఘటనలో కుట్ర కోణం ఉందని ఆరోపిస్తూ.. స్వతంత్ర దర్యాప్తు కోరుతూ విజయ్ పార్టీ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. దీన్ని తొలుత వ్యతిరేకించిన న్యాయస్థానం.. ఆ తర్వాత సిట్ దర్యాప్తునకు ఆదేశించింది. అటుపై సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సీబీఐ దర్యాప్తు చేస్తుండగా, రిటైర్డ్ సుప్రీం కోర్టు జడ్జి పర్యవేక్షణ కమిటీ ఆ దర్యాప్తును ఎప్పటికప్పుడు సమీక్షించనుంది. ప్రామాణిక నిర్వహణ విధాన నిబంధనలు రూపొందించేవరకు హైవేలపై ఏ రాజకీయ పార్టీ సభలకు పోలీసులు అనుమతివ్వరని తమిళనాడు ప్రభుత్వం ప్రకటించింది. వచ్చే ఏడాది తమిళనాడు అసెంబ్లీకి ఎన్నికలు జరగాల్సి ఉంది.

## 12 రాష్ట్రాలలో ఎస్ఐఆర్ రెండో దశను ప్రారంభిస్తాం




**న్యూఢిల్లీ:** దేశ వ్యాప్తంగా ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటిగ్రేటెడ్ రివిజన్ - ఎస్ఐఆర్) ఫేజ్‌వన్ విజయవంతంగా ముగిసిందని కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. సోమవారం(సెప్టెంబర్ 27) కేంద్రం ఎన్నికల సంఘం మీడియా సమావేశంలో ఎస్ఐఆర్ మాట్లాడారు. 1951నుంచి 2004 వరకు ఎనిమిది సార్లు ఎస్ఐఆర్ నిర్వహించారు. 21ఏళ్ల తర్వాత మళ్లీ ఎస్ఐఆర్ విజయవంతంగా పూర్తి చేస్తున్నాం. బిహార్‌లో 7.5కోట్ల మంది ఎస్ఐఆర్ విజయవంతంగా పూర్తయ్యింది. బిహార్‌లో ఎస్ఐఆర్‌పై ఎవరు అభ్యంతరాలు చెప్పలేదు. త్వరలో రెండో దశలో 12 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎస్ఐఆర్ నిర్వహిస్తాం. ఈరోజు అర్ధరాత్రి తర్వాత ఓటర్ల జాబితా లాక్ చేస్తాం. ప్రతి ఇంటికి మూడుసార్లు బిఎల్ఓ విజిట్ చేస్తారు. బీఎల్ఓ ఇచ్చే ఎన్యుమరేషన్ ఫాంలో వివరాలు నమోదు చేసి సంతకం చేయాలి. 2003లో ఎవరితో ఉన్నామని లింక్ వివరాలు నమోదు చేయాలి. ఎన్యుమరేషన్ ఫామ్‌లో మ్యాచింగ్ , లింకింగ్ ప్రధానం. ఎన్యుమరేషన్ ఫాం రిటర్న్ చేసిన వారినే ఓటర్ జాబితాలో నమోదు చేస్తారు. బూత్ లెవెల్ ఏజెంట్లు 50 ఫారంలు ఎన్నికల సంఘానికి అందజేయవచ్చు. అన్ని ఎన్యుమరేషన్ ఫారంలు వచ్చిన తర్వాత ముసాయిదా ఓటర్ జాబితా విడుదల చేస్తాం'అని తెలిపారు. ఇందులో భాగంగా నవంబర్ 4 నుంచి డిసెంబర్ 4 వరకు ఎస్ఐఆర్. డిసెంబర్ 9న ముసాయిదా జాబితా విడుదల. డిసెంబర్ 9 నుంచి 8 జనవరి వరకు అభ్యంతరాల స్వీకరణ. డిసెంబర్ 9 నుంచి జనవరి 31 వరకు హియరింగ్ ,వెరిఫికేషన్ ఫిబ్రవరి 7న ఓటర్ల తుది జాబితా విడుదల ఉంటుందని వెల్లడించారు.

## డిజిటల్ అరెస్ట్..అత్యంత భయంకరమైన ముప్పు



**ఢిల్లీ:** డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ నేరగాళ్లు ప్రజలను బెదిరింపులకు గురి చేస్తూ..భారీ మొత్తంలో డబ్బును కాజేస్తుండడంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆందోళన వ్యక్తం చేశారు. డిజిటల్ అరెస్టును ప్రజలకు ఉన్న అత్యంత భయంకరమైన ప్రమాదాల్లో ఒకటిగా పేర్కొన్నారు. ఇటువంటి వాటిని ఎదుర్కోవాలంటే సైబర్ నేరాలపై ప్రజలకు పోలీసులు సరైన అవగాహన కల్పించాలన్నారు. పోలీసుల పట్ల ప్రజలకు భయం ఉండకూడదని, వారు తమకు రక్షణగా నిలుస్తారనే గౌరవం ఉండాలని పేర్కొన్నారు. రాష్ట్రపతి భవన్‌లో ప్రొబేషనరీ ఐపీఎస్‌లను ఉద్దేశించి ప్రసంగించిన ముర్ము ఈ వ్యాఖ్యలు చేశారు. సైబర్ నేరగాళ్లు వీడియో కాల్స్ చేసి..తాము పోలీసులమని బెదిరిస్తారని.. తాము చెప్పినట్లు చేయకపోతే డిజిటల్ అరెస్టు చేస్తామని భయపెడతారని ద్రౌపదీ ముర్ము అన్నారు. ఇటువంటి సమయాల్లో ప్రజలు చాకచక్యంగా వ్యవహరించి పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ డిజిటల్ అరెస్టు ప్రభావం పోలీసు వ్యవస్థపైనా అధికంగా ఉంటుందన్నారు. సైబర్ నేరగాళ్లు పోలీసుల మాదిరి ప్రజలను నమ్మించి మోసం చేయడంతో.. అసలైన పోలీసులు ఎవరనే విషయాన్ని కూడా వారు గ్రహించలేకపోతారన్నారు. దీనిని నివారించాలంటే సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, పోలీసులు నూతన సాంకేతికతపైనా పట్టు సాధించాలని సూచించారు.

## 'దేశం పరువు తీశారు..' రాష్ట్రాలపై సుప్రీం కోర్టు ఆ?గ్రహం



వీధి కుక్కల వ్యవహారంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. రాష్ట్రాలపై సోమవారం సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తమ ఉత్తర్వులను అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యాయని.. తద్వారా అంతర్జాతీయ స్థాయిలో దేశం పరువు తీశారంటూ తీవ్ర వ్యాఖ్యలే చేసింది. వీధి కుక్కల నియంత్రణకు ఆగస్టులో సుప్రీం కోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. షెల్టర్ల ఏర్పాటు అంశం పరిశీలన నేపథ్యంలో.. శునకాలను పట్టుకుని, శస్త్రచికిత్స చేసి, తిరిగి వదిలే విధానాన్ని అమలు చేయాలని ఆగష్టు నెలలో అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఆదేశించింది. ఈ మేరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియజేస్తూ అఫిడవిట్లు దాఖలు చేయాలని రాష్ట్రాలకు సూచించింది. కానీ ఇప్పటివరకు పశ్చిమ బెంగాల్, తెలంగాణ, ఢిల్లీ ప్రభుత్వాలు మాత్రమే స్పందించాయి. అవి కూడా దీపావళి సెలవుల్లో అఫిడవిట్లు సమర్పించడంతో రికార్డుల్లో అధికారికంగా నమోదు కాలేదు. ఈ పరిణామంపై సోమవారం విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రెండు నెలలు గడిచినా, ఇంకా స్పందన లేదు. దీని అర్థం ఏంటి?. మీరు స్పందించకపోవడంతో.. ప్రపంచస్థాయిలో దేశం పరువును మీరే తీస్తున్నారు. ఇది సిగ్గు చేటు.. అంటూ రాష్ట్రాలపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో.. నవంబర్ 3న అన్ని రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలు వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేసింది. అయితే.. తెలంగాణ, పశ్చిమ బెంగాల్ సీఎస్‌లకు మాత్రం మినహాయింపు ఇచ్చింది. తమ ఆదేశాల తర్వాత కూడా దేశవ్యాప్తంగా వీధి కుక్కల దాడుల ఘటనలు నమోదు చేసుకున్నాయని కోర్టు ఈ సందర్భంగా ప్రస్తావించింది. ప్రజల భద్రతను నిర్లక్ష్యం చేయడం సర్వసాధారణమైన విషయం కాదంటూ రాష్ట్రాలను ఉద్దేశించి కోర్టు స్పష్టం చేసింది. తాజా వ్యాఖ్యల నేపథ్యంతో.. వచ్చే సోమవారం జరిగే విచారణ కీలకంగా మారే అవకాశం కనిపిస్తోంది.

# రెండేళ్లు అయిపోయాయి.. ఇంకో మూడేళ్లలో చేసేది ఏమీ ఉండదు

-మొదటిపేజీ తరువాయి

మూడేళ్లలో కూడా వీళ్లు చేసేది ఏమీ ఉండదని కేటీఆర్ విమర్శించారు. శంషాబాద్‌లో బీఆర్ఎస్ మైనార్టీ నేతలతో జరిగిన సమావేశంలో కేటీఆర్ పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ షాదీ ముబారక్ వంటి పథకాన్ని ప్రవేశపెట్టారు.. షాదీ ముబారక్ కింద రూ.లక్ష ఇస్తే.. మేం అంతకంటే ఎక్కువ ఇస్తామని కాంగ్రెస్ చెప్పిందని.. మైనార్టీలను కాంగ్రెస్ ఓటు బ్యాంక్‌కుగా చూస్తోందని ఆరోపించారు.

**పొరపాట్లు చేసి ఉంటే చేసుండొచ్చు..**

మైనార్టీ స్కూళ్లను కేసీఆర్ ప్రారంభించారని.. మైనార్టీ స్కూల్స్‌తో ఎంతో మంది విద్యార్థులు డాక్టర్లు అవుతున్నారన్నారు. నాలుగు ఉన్న మెడికల్ కాలేజీలు కేసీఆర్ 34కు పెంచారాని.. విద్యార్థులకు 20 లక్షల స్కాలర్‌షిప్ ఇచ్చారని.. పదేళ్లలో ఎన్నో పనులు చేశారన్నారు. మేం కూడా కొన్ని కొన్ని పొరపాట్లు చేసి ఉంటే చేసుండొచ్చని.. కానీ.. ఇండియాలో మైనార్టీలకు కేసీఆర్ చేసినన్ని పనులు ఇంకెవరూ చేయలేదన్నారు. తెలంగాణలో 45 లక్షల మంది ముస్లింలు ఉన్నారని.. కేసీఆర్ హయాంలో ఒక్కొక్కరిపై రూ.5వేల ఖర్చు చేశారని. ఇది అన్ని రాష్ట్రాల కంటే చాలా ఎక్కువ అని తెలిపారు. మైనార్టీల సంక్షేమం కోసం అత్యధికంగా ఖర్చు చేసింది కేసీఆరేనని.. ఈ విషయాన్ని ఇతర రాష్ట్రాల్లో అసదుద్దీన్ ఒవైసీ కూడా చెప్పారు.. కానీ ఇక్కడ చెప్పరన్నారు.

**తెలంగాణ బుల్డోజర్ రాజ్యంపై రాహుల్ ఎందుకు సైలెంట్‌గా ఉన్నడు?**

బుల్డోజర్ రాజ్యం నడవదని యూపీపై రాహుల్ గాంధీ విమర్శించారని.. ఇక్కడ అదే బుల్డోజర్ రాజ్యం నడుస్తుంటే రాహుల్ గాంధీ ఎందుకు సైలెంట్‌గా ఉన్నారని కేటీఆర్ ప్రశ్నించారు. హైడ్రాపై రాహుల్ గాంధీ సైలెంట్‌గా ఉన్నారని.. రాజేంద్ర నగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌తో పాటు మరో తొమ్మిది మంది ఎమ్మెల్యే పార్టీ మారారని.. మీరు ఏ పార్టీలో ఉన్నారని వారిని అడగండి.. వాళ్లు సమాధానం చెప్పలేదన్నారు. ఇదే విషయంపై ఒకసారి జర్నలిస్టు కడియం శ్రీహరిని ప్రశ్నిస్తే.. ఎక్కడ ఉండాలో అక్కడే ఉన్నా అని సమాధానం చెప్పారు.. ఇది వాళ్ల పరిస్థితి అంటూ గుర్తు



చేశారు. సీఎం అవుతానని రేవంత్ రెడ్డి కూడా అనుకోలేదని.. ఒక యువకుడు మంచి రీల్ చేశాడని.. ఈ రెండేళ్లలో రేవంత్ రెడ్డి ఏం చేశారని అడిగితే.. ఆయన చేసింది ఒక్కటే కేసీఆర్ పేరు తీయడం.. కేసీఆర్‌ను గుర్తు చేసుకోవడం అంతేనన్నారు.

**బహిరంగంగానే చెబుతున్నడు..**

మోదీ స్కూల్లో చదివానని.. చంద్రబాబు కాలేజీకి వెళ్లానని.. రాహుల్ దగ్గర ఉద్యోగం చేస్తున్నానని రేవంత్ బహిరంగంగానే చెబుతున్నారని.. చౌకీదార్ చోర్ అని రాహుల్ అంటే.. రేవంత్ రెడ్డి కాదు కాదు.. ఆయన నా పెద్దన్న అని చెబుతున్నాడన్నారు. సీబీఐ, ఈడీ, ఐటీ వంటి సంస్థలు మోదీ జేబు సంస్థలు అని విమర్శిస్తే.. రేవంత్ రెడ్డి మాత్రం కాళేశ్వరం కేసు సీబీఐకి అప్పగిస్తారని.. ఒక సంవత్సరం క్రితం పొంగులేటి ఇంటిపై ఈడీకి రైడ్స్ అయ్యాయని.. ఒకటి కాదు రెండు రోజులు రైడ్స్ అయ్యాయని గుర్తు చేశారు. నోట్లు లెక్కపెట్టే మెషిన్‌లను లోపలికి తీసుకెళ్లిన దృశ్యాలు అంతా చూశారని. అంత జరిగిన తర్వాత ఏమైంది.. ఏమీ కాలేదు.. అంతా సైలెంట్ అంటూ విమర్శించారు. రేవంత్ రెడ్డి బంధువుకు కేంద్రంలో కాంట్రాక్టులు వస్తాచయని.. బదులుగా రేవంత్ రెడ్డి కూడా బీజేపీ నేతకు లాభం చేకూరుస్తారనవి ఆరోపించారు.

**మోదీ చట్టాలను బీజేపీ పాలిత రాష్ట్రాల కంటే.. రేవంత్ త్వరగా అమలు చేస్తడు : కేటీఆర్**

కేంద్రంలోని మోదీ సర్కారు తెచ్చిన చట్టాలను బీజేపీ పాలిత రాష్ట్రాలకంటే త్వరగా తెలంగాణలో రేవంత్‌రెడ్డి అమలు చేస్తారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. బడే భాయ్ కోసం రేవంత్ రెడ్డి చేసిన పని ఇదేనని.. ఇక్కడ నడుస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వం కాదు.. కాంగ్రెస్-బీజేపీ కలిసి నడిపిస్తున్న ప్రభుత్వం ఇది అంటూ విమర్శించారు. శంషాబాద్‌లో బీఆర్ఎస్ మైనార్టీ నేతలతో జరిగిన సమావేశంలో కేటీఆర్ పాల్గొని మాట్లాడారు. ఆరు గ్యారెంటీలు వంద గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పారని.. తులం బంగారం ఇస్తాం.. యువతులకు రూ.2500 ఇస్తాం.. వృద్ధులకు రూ.4వేలు పెన్షన్ ఇస్తామని అరచేతిలో స్వర్గం చూపించారని విమర్శించారు.

అదేదో సినిమాలో కోడిని వేలాడదీసి దాన్నే చికెన్ అనుకోమన్నట్లు.. ఇక్కడ కూడా అన్ని చెప్పారని.. కానీ ఒక్కటి కూడా అమలు చేయట్లేదని విమర్శించారు. మైనార్టీ విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తామని చెప్పి కాంగ్రెస్ మాట తప్పిందని.. కేసీఆర్ ఇచ్చిన పథకాలను కూడా ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేసిందని మండిపడ్డారు. 2018లో ఎన్నికలు గెలిచిన తర్వాత మహమూద్ అలీని కేసీఆర్ డిప్యూటీ సీఎంని చేశారని.. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క మైనార్టీ ఎమ్మెల్యే కానీ, ఎమ్మెల్సీ కానీ లేరని.. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలోనైనా ఒక్క మైనార్టీ లీడర్‌ను కూడా ఎన్నుకోలేదని ధ్వజమెత్తారు. షబ్బీర్ అలీ, అజారుద్దీన్ లాంటి వారు కూడా కాంగ్రెస్‌కు కనిపించట్లేదా..? అంటూ నిలదీశారు.

ఎమ్మెల్సీ ఇచ్చినట్లే ఇచ్చి అజారుద్దీన్‌ను పక్కన పెట్టేశారని.. క్రికెట్‌లో అజారుద్దీన్ కట్ షాట్‌లు కొడితే.. ఇక్కడ అజారుద్దీన్‌నే రేవంత్ రెడ్డి కట్ చేసేశారని.. రెండేళ్లలో ఏం చేశారని నిలదీస్తే వాళ్లు చెప్పేది ఒక్కటే ఒక్కటి.. అది ఫ్రీ బస్ మాత్రమేనన్నారు. మహిళలకు ఫ్రీ బస్ అంటారు.. పురుషులకు టికెట్ రేట్ డబుల్ చేశారని ఆరోపించారు. ఇలాంటి మైనార్టీ సమావేశాలు ప్రతి జిల్లాలో జరగాల్సిన అవసరం ఉందని.. తెలంగాణలో కేసీఆర్ మరోసారి రావాల్సిన అవసరం ఉందన్నారు. నవంబర్ 11న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు జరుగనున్నాయని.. కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు మైనార్టీలంతా కలిసి రావాలని కోరారు. జూబ్లీహిల్స్‌లో గెలుపు ఖాయమైందని.. కానీ మెజార్టీ ఎంత అన్నదే తేలాలన్నారు.

# రేవంత్ రెడ్డి.. ఆటో డ్రైవర్లు అంటే ఎందుకు అంత చిన్న చూపు

**హైదరాబాద్:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆటో డ్రైవర్ల పరిస్థితి పూర్తి అధ్వానంగా తయారైందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. అధికారంలోకి వచ్చి రెండేండ్లయినా ఆటో కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ రేవంత్ రెడ్డి అమలు చేయలేదని మండిపడ్డారు. ఆటో కార్మికులకు బాకీ పడిన రూ.24 వేలు ఎంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌ను ఓడిస్తేనే హామీని నెరవేరుస్తారని చెప్పారు. కోకాపేటలోని తన నివాసం నుంచి ఎర్రగడ్డకు, అక్కడి నుంచి తెలంగాణ భవన్ వరకు హరీశ్ రావు ఆటోలో ప్రయాణించారు. అనంతరం మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలు ఆందోళనలో ఉన్నారు. రైతులు, చిరు ఉద్యోగులు, మహిళలు, ఆటో డ్రైవర్లు కావచ్చు.. అందరూ ఆవేదనలో ఉన్నారు. ఆటో డ్రైవర్ల పరిస్థితి మరీ ఆందోళనకరంగా ఉంది. పేరుకి ఉచిత బస్సు అన్నారు, మహిళలకు ఫ్రీ అన్నారు. మొగోళ్ళకి డబల్ టికెట్ కొడుతున్నారు. టికెట్ రేట్లు పెంచి కుటుంబం మీద భారం వేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఐదుసార్లు బస్ చార్జీలు పెంచింది. రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచారంలో హైదరాబాద్‌కి వచ్చి సినిమా నటులకంటే ఎక్కువ యాక్టింగ్ చేశారు. చిక్కడపల్లి సెంట్రల్ లైబ్రరీలో మెట్ల మీద కూర్చొని కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే మొదటి ఏడాది 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులను మోసం చేశారు. నిరుద్యోగులను వాడుకొని ఓట్లు, డబ్బులు తీసుకొని.. నిరుద్యోగ యువతీ యువకులను వదిలేశారు. నాడు రాహుల్ గాంధీ హైదరాబాద్ వచ్చి ఇదే యూసఫ్‌గూడా జూబ్లీహిల్స్‌లో ఆటో ఎక్కి ఆటో కార్మికులకు అరచేతిలో వైకుంఠం చూపించారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.12 వేలు ఇస్తామని చెప్పారు. ఆటోనగర్, ఆటో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామన్నారు. ఆటోనగర్ అసలే లేదు. ప్రమాద బీమా రూ.10 లక్షలకు పెంచుతామని పత్తా లేదు. ఇస్తామన్న రూ.12 వేలకి దిక్కు లేదు. రాష్ట్రంలో ఉన్న 5 నుంచి 6 లక్షల ఆటోలకు కాంగ్రెస్ పార్టీ ఒక్కొక్క ఆటోకు రూ.24 వేలు బాకీ పడింది. ఆ మొత్తాన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు వాటాల కోసం




తన్నుకుంటున్నారు. వాటికోసం పైసలు ఉన్నాయి. కానీ ఆటో కార్మికులకు నెలకు రూ.1000 ఇవ్వడానికి లేవా?. రేవంత్ రెడ్డి నెల నెల మూటలు మోస్తూ ఢిల్లీకి కప్పం కడుతున్నాడు. ఆటో డ్రైవర్లు అంటే ఎందుకు అంత చిన్న చూపు. లక్ష కోట్లతో మూసీ సుందరీకరణ చేస్తున్నాం, లక్ష కోట్లతో ఫోర్త్ సిటీ నిర్మిస్తానంటున్నావు. కానీ ఆటో డ్రైవర్లకు నెలకు రూ.1000 ఇవ్వలేవా రేవంత్ రెడ్డి?. రాహుల్ గాంధీ.. ఓట్ల కోసం ఆటో ఎక్కి తిరిగావు. ఇప్పుడు ఆటో కార్మికుల కష్టాలు పట్టవా?. మరోసారి రాహుల్ గాంధీ హైదరాబాద్ వస్తే శంషాబాద్‌లో ఆటోలతో నిరసన తెలుపుతాం. రాహుల్ గాంధీకి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆటో కార్మికుల బాధ తెలవాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా ఆటోల నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది. వెంటనే బాకీ పడ్డ రూ.24 వేలు ప్రతి ఆటో డ్రైవర్‌కి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. మొత్తం ఆటో కార్మికులకు రెండేండ్ల బాకీ చెల్లించినా రూ.1500 కోట్లు అవుతుంది. రూ.3 లక్షలు ఫీజు పెంచితే మద్యం టెండర్లపై రూ.3 వేల కోట్లు ప్రభుత్వానికి వచ్చాయి. అందులో నుంచి రూ.1500 కోట్లు ఆటో కార్మికులకు ఇచ్చి వారిని కాపాడాలని డిమాండ్ చేస్తున్నాం. ఇప్పటివరకు 161 మంది ఆటో కార్మికులు చనిపోయారు. ఆ కుటుంబాలు రోడ్డున పడ్డాయి. చనిపోయిన ఆటో డ్రైవర్ కుటుంబానికి ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున ఇవ్వాలి. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేస్తాం. ఆటో కార్మికులు ఎవరూ చనిపోవద్దని విజ్ఞప్తి చేస్తున్నా. మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే. తప్పకుండా మిమ్మల్ని కాపాడుకుంటాం. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఆటో కార్మికులు ఎక్కడ ఉన్నా కాంగ్రెస్‌ని ఓడించేలా పనిచేయండి. ప్రతి ఆటో అన్న రెండు ఫోన్లు చేసి మీ బంధుమిత్రులకు జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్‌కి ఓటు వేయాలని చెప్పండి. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ ఓడిపోతే కనీసం రేవంత్ రెడ్డికి బుద్ధి వస్తుంది. ఆటో కార్మికులకు ఇస్తానన్న హామీలు నెరవేరుస్తాడు. రేవంత్ రెడ్డి గురువు ఆంధ్రప్రదేశ్‌లో ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు ఇస్తున్నారు. రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లందరికీ బీఆర్ఎస్ పార్టీ మద్దతుగా ఉంది. అసెంబ్లీలో ఆటో డ్రైవర్ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేసి అసెంబ్లీని స్తంభింపజేస్తాం. కేసీఆర్ మళ్ళీ వస్తారు. ఆటో డ్రైవర్ల కష్టాలు తీరుస్తారు.' అని హరీశ్ రావు అన్నారు

# తెలుగు టెక్ ట్యూట్స్..

**కరీంనగర్ :** తెలంగాణ రాష్ట్రంలోని పెద్దపల్లి జిల్లాకు చెందిన ఒక యువకుడు తన సాంకేతిక పరిజ్ఞానం, డిజిటల్ కంటెంట్ క్రియేషన్ ద్వారా అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవాన్ని పొందారు. గోదావరిఖనిలోని యైటింక్లైన్ కాలనీకి చెందిన సయ్యద్ హఫీజ్ కు ఏకంగా యూఏఈ గోల్డెన్ వీసా లభించింది. సింగరేణి కార్మికుడి కుటుంబం నుంచి వచ్చి, ఉన్నత విద్య చదవకపోయినా.. తన సొంత టాలెంట్ తో ఈ స్థాయికి ఎదగడం తెలంగాణ వాసులకు గర్వకారణంగా నిలిచింది. హఫీజ్ 2011లోనే 'తెలుగు టెక్ ట్యూట్స్' పేరుతో తన యూట్యూబ్ ఛానెల్‌ను ప్రారంభించారు. తెలుగు రాష్ట్రాల ప్రజలందరికీ సుపరిచితులైన హఫీజ్.. తన వీడియోల ద్వారా డిజిటల్ స్టార్‌గా ఎదిగారు. ప్రధానంగా మొబైల్ ఫోన్లు, టీవీలు, ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్ల గురించి సమగ్రంగా వివరిస్తారు. కొత్త ఫోన్ల అన్‌బాక్సింగ్ .. వాటి ప్రత్యేకతలు, లాభనష్టాలు, అప్‌డేట్స్‌లోని పాజిటివ్, నెగటివ్ అంశాలను ప్రజల ముందు ఆవిష్కరిస్తారు.సుమారు 1.8 మిలియన్లకు (1.79 మిలియన్లు) పైగా సబ్‌స్క్రైబర్లు కలిగి ఉన్న ఈ ఛానెల్ ద్వారా హఫీజ్ 4.2 వేలకు పైగా వీడియోలను అందించి మన్ననలు పొందారు. ప్రస్తుతం యూట్యూబ్ ద్వారా ఆయన నెలకు రూ. 2 లక్షలకు పైగా ఆదాయాన్ని పొందుతున్నారు. హఫీజ్ డిజిటల్ ప్రయాణం కేవలం తెలుగు రాష్ట్రాలకే పరిమితం కాలేదు. 2022లో ఫోర్బ్స్ ఇండియా ప్రకటించిన టాప్ 100 డిజిటల్ స్టార్స్ జాబితాలో సయ్యద్ హఫీజ్ 32వ స్థానంలో నిలిచారు. తెలుగు ప్రజలను ఆయన వీడియోలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయని ఫోర్బ్స్ తన మ్యాగజైన్‌లో కొనియాడింది.సామాజిక ప్రభావాన్ని సృష్టించగలిగిన ప్రపంచవ్యాప్తంగా 10 వేల మంది క్రియేటర్లను ఎంపిక చేసే యూఏఈ గోల్డెన్ వీసాకు హఫీజ్ అర్హత సాధించడం ఎంతో గొప్ప విషయం. సాధారణంగా రెండేళ్ల వీసాకే రూ. 4 కోట్లకు పైగా ఖర్చయ్యే చోట.. హఫీజ్‌కు, ఆయన కుటుంబ సభ్యులకు పదేళ్లపాటు ఉచితంగా యూఏఈలో నివసించేందుకు.. అక్కడ ఉద్యోగం లేదా వ్యాపారం చేసుకునేందుకు ఈ వీసా అవకాశం కల్పిస్తుంది. అంటే దాదాపు హఫీజ్‌కు పరోక్షంగా రూ.40 కోట్ల వరకు ఆదా అయింది. ఈ అరుదైన అవకాశం దక్కడంపై సయ్యద్ హఫీజ్ ను సదాశివ ఫౌండేషన్ శాలువాలతో సన్మానించారు. హఫీజ్ సాధించిన ఈ అంతర్జాతీయ విజయం తెలుగు యువతకు ఒక స్ఫూర్తిదాయకమైన ఉదాహరణగా నిలుస్తుందన్నారు.

## మొంథా తుపాను ఎఫెక్ట్.. తెలంగాణలో అత్యంత భారీ వర్షాలు

**హైదరాబాద్** మొంథా తుపాను ప్రభావంతో తెలంగాణ రాష్ట్రానికి మరో మూడు రోజులు అత్యంత భారీ వర్ష సూచన ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం మొంథా తుపానుగా మారిందని తెలిపారు. మొంథా తుపాను కాకినాడకి 570 కిలోమీటర్లు, విశాఖపట్నానికి 600 కిలోమీటర్ల పరిధిలో కేంద్రీకృతం అయిందని చెప్పుకొచ్చారు. రేపు(మంగళవారం) ఈ తుపాను ఉత్తర వాయవ్య దిశలో కదిలి తీవ్ర తుపానుగా మారనుందని పేర్కొన్నారు. ఈ తీవ్ర తుపాను మంగళవారం రాత్రి, లేదా ఎల్లుండి(బుధవారం) ఉదయంలోగా మచిలీపట్నం, కళింగపట్నం ఇంచుమించు.. కోస్తా ఆంధ్రప్రాంతంలో తీరం దాటే అవకాశం ఉందని తెలిపారు. తుపాను తీరం దాటే సమయంలో 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వెల్లడించారు. తుపాను ప్రభావంతో ఈరోజు(సోమవారం) నాగర్ కర్నూల్, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలకు భారీ వర్ష సూచన ఉండే అవకాశాలు ఉన్నాయని వివరించారు. మిగతా అన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని పేర్కొన్నారు. మంగళవారం, బుధవారం భారీ నుంచి అతి భారీ వర్ష సూచన ఉండే అవకాశం ఉందని వివరించారు. మంగళవారం పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసినట్లు ప్రకటించారు. మంగళవారం 19 జిల్లాలకు భారీ వర్ష సూచన ఉందని వెల్లడించారు. బుధవారం ఆదిలాబాద్, కొమరం భీమ్, ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలకు అత్యంత భారీ వర్ష సూచన ఉంటుందని తెలిపారు. తుపాను దృష్ట్యా ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశామని ప్రకటించారు. అలాగే, ఎల్లుండి బుధవారం నిర్మల్, మంచిర్యాల, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు భారీ వర్ష సూచన ఉండే అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు.

## తెలంగాణలో గన్ కల్చర్ పెరుగుతోంది



**హైదరాబాద్:** రాష్ట్రంలో రైతుల పరిస్థితి రోజురోజుకూ దిగజారిపోతోందని తెలంగాణ భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. గత భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం రైతులకు బేడీలు వేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసుల కాళ్లు పట్టుకునే దుస్థితికి తీసుకొచ్చిందన్నారు. రైతులు పండించిన పంటను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రైతులు ధాన్యాన్ని అమ్మలేని స్థితిలో ఉన్నారని చెప్పారు. "పదవీవిరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులకు బెనిఫిట్స్, పింఛన్ ఇవ్వడం లేదు. రెండేళ్ల నుంచి బెనిఫిట్స్ రావడం లేదని ముఖ్యమంత్రికి లేఖ రాశా. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. ఉద్యోగులు, రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోంది. రాష్ట్రంలో గన్ కల్చర్ పెరుగుతోంది. సాధారణ వ్యక్తికే కాదు.. పోలీసులకే రక్షణ లేకుండా పోయింది. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలిస్తే.. రౌడీ షీటర్లపై కేసులు ఎత్తివేస్తుంది. వారికి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తుంది. మజ్లీస్‌తో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం శాంతి భద్రతలను దెబ్బతీస్తోంది" అని రామచందర్‌రావు ఆరోపించారు.

**జూబ్లీహిల్స్‌లో పోటీ మజ్లిస్- భాజపా మధ్యే**

రాబోయే రోజుల్లో భాజపా విజయానికి జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నాంది కావాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఉప ఎన్నికపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, శక్తి కేంద్ర ఇన్‌ఛార్జులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడారు. "జూబ్లీహిల్స్‌లో మజ్లిస్-భాజపా మధ్యే పోటీ ఉంటుంది. ప్రజలు భాజపాకు ఓటేయకుంటే మజ్లిస్ సీట్లు 8 అవుతాయి. ఆ పార్టీని ఆపాలంటే భాజపాను గెలిపించాలి. జూబ్లీహిల్స్‌కు కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి చేసిందేమీ లేదు. భాజపాను గెలిపించాలనే ఆలోచనలో ప్రజలు ఉన్నారు" అని రామచందర్‌రావు అన్నారు.

## ఫుల్ జోష్‌లో కేసీఆర్

-మొదటిపేజీ తరువాయి



రాజకీయ పరిణామాలపై ఆరా తీయడంతో పాటు తన దృష్టికి వచ్చిన అంశాలను కూడా ప్రస్తావించారట. చాలా రోజుల తర్వాత తమ అధినేత అంత యాక్టీవ్‌గా..అధికారంలో ఉన్నంత జోష్‌లో కనిపించడంతో బీఆర్ఎస్ నేతలు హ్యాపీ అయిపోతున్నారు.ఇక ఈ సమావేశంలో కేసీఆర్ మాట్లాడిన మాటలు, ఇచ్చిన భరోసా గులాబీ నేతల్లో నూతన ఉత్తేజం నిపిందట. రెండేళ్లు కాంగ్రెస్ పాలనపై తెలంగాణ ప్రజలు విసిగిపోయారని, ఇచ్చిన ఒక్క హామిని కూడా సరిగ్గా నెరవేర్చలేదని, జనానికి కాంగ్రెస్ సర్కార్‌పై నమ్మకం పోయిందని ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు కేసీఆర్. ఇదే సమయంలో వచ్చే రెండున్నరేళ్లలో మళ్లీ అధికారంలోకి వస్తామని అధినేత కేసీఆర్ నమ్మకంగా చెప్పడం బీఆర్ఎస్ నేతలకు బూస్టప్ ఇచ్చిందట.


**మళ్లీ ప్రజాక్షేత్రంలోకి అడుగుపెట్టబోతున్న సార్..**

ఫాంహౌస్ మీటింగ్‌లో గులాబీ బాస్ మాట తీరును గమనించిన కారు పార్టీ లీడర్లు..సార్ మళ్లీ ప్రజాక్షేత్రంలోకి అడుగుపెట్టబోతున్నారని అంటున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా కేసీఆర్ ఒక సభలో పాల్గొంటారని అంటున్నారు. ఇక ఇక్కడి నుంచి మునుపటిలా యాక్టీవ్ కాబోతున్నారట. అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా రెండున్నరేళ్ల సమయం ఉంది కాబట్టి..ఇప్పటినుంచే ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్లాలని కేసీఆర్ డిసైడ్ అయినట్లు తెలంగాణ భవన్ వర్గాల టాక్.ఈ క్రమంలోనే ఇకపై కేసీఆర్ రెగ్యులర్‌గా తెలంగాణ భవన్‌కు రానున్నట్లు తెలుస్తోంది. పార్టీ లీడర్లతో వరుస సమావేశాలు, కార్యకర్తల మీటింగ్‌లు, ప్రజా సమస్యలపై కార్యాచరణ రూపొందించడం వంటి యాక్టివిటీతో గులాబీ దళపతి బిజీ బిజీగా గడపనున్నారని ముఖ్య నేతలు చెబుతున్నారు.పరిస్థితులను బట్టి జిల్లాల పర్యటనలకు వెళ్లేందుకు కూడా ఆయన ప్లాన్ చేస్తున్నారట. ఇదే గనుక జరిగితే బీఆర్ఎస్ పార్టీలో మునుపటి జోష్ వస్తుందని, మళ్లీ వచ్చే ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చేందుకు ఎంతో యూజ్ అవుతుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఏదైనా సార్ ఫుల్ యాక్టీవ్‌గా కనిపించడంతో లీడర్లకు తిరిగి అధికారంలోకి వచ్చినంత ఆనందం కలిగిందని అంటున్నారు.

# వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలి

## రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి





**ధర్మఘంట, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 27:** రాష్ట్రంలో వరి ధాన్యం, పత్తి కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ అదనపు కలెక్టర్లు, జిల్లా పౌరసరఫరాలు, వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధి, రవాణా శాఖల అధికారులతో వరి ధాన్యం, పత్తి కొనుగోలు, అకాల వర్షాల కారణంగా తీసుకోవలసిన జాగ్రత్తలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి మాట్లాడుతూ, తుఫాను వల్ల అకాల వర్షాల నేపథ్యంలో వరి ధాన్యం, పత్తి కొనుగోలు ప్రక్రియకు ఎలాంటి అవాంతరాలు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో అవసరమైన టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉన్నాయని, ప్యాడి క్లీనర్లు, తేమ యంత్రాలు అవసరం మేరకు సమకూర్చాలని తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి మాట్లాడుతూ, తుఫాను తీవ్రత అధికంగా ఉన్నందున అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. తుఫాను తీవ్రత తగ్గేవరకు హార్వెస్టింగ్ ప్రక్రియ నిలిపి వేయాలని, హార్వెస్టింగ్ చేసిన ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. రైతులు నష్టపోకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పత్తి కొనుగోలు కపాస్ కిసాన్ యాప్ ద్వారా చేయడం జరుగుతుందని, ఈ యాప్ లో కౌలు రైతులు కూడా సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారుల సహాయంతో వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. వరి ధాన్యం, పత్తి రైతులు తేమ శాతం నిబంధనల ప్రకారం ఉండేలా చూసుకోవాలని, తేమ శాతాన్ని పెంచాలని కేంద్రానికి విజ్ఞప్తి చేయడం జరుగుతుందని తెలిపారు. సరిహద్దు జిల్లాల వారు అప్రమత్తంగా ఉండాలని, బయట రాష్ట్రాల నుండి వచ్చే వరి ధాన్యం, సోయాబీన్, కందులు, పెసలు అక్రమ రవాణా జరగకుండా పర్యవేక్షించాలని తెలిపారు. రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ రవీంద్ర మాట్లాడుతూ, రాష్ట్రంలో అన్ని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని, వర్షాల దృష్ట్యా ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. గ్రేడ్ ఏ రకానికి క్వింటాలుకు 2 వేల 389 రూపాయలు, సాధారణ రకానికి క్వింటాలుకు 2 వేల 369 రూపాయలుగా మద్దతు ధర నిర్ణయించడం జరిగిందని, సన్న రకం వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు 500 రూపాయలు అదనంగా అందించడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో అవసరమైన టార్పాలను, కవర్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ మాట్లాడుతూ, పత్తి కొనుగోలు ప్రక్రియ కొరకు చర్యలు చేపట్టాలని, కపాస్ కిసాన్ యాప్ లో రైతుల వివరాలు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి అవసరమైన అన్ని జాగ్రత్తలు పాటిస్తూ పత్తి కొనుగోలు చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వరి ధాన్యం, పత్తి కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కనీస మౌలిక వసతులు కల్పించడంతో పాటు ప్యాడి క్లీనర్లు, టార్పాలిన్లు, ఇతర సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 301 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, సిసిఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోలు కొరకు పూర్తిస్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దేశ ప్రగతికి అవరోధమైన అవినీతిని నిర్మూలించాలి

## ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ



**ధర్మఘంట, మందమర్రి అక్టోబర్ 27:** దేశ ప్రగతికి అవరోధమైన అవినీతిని నిర్మూలించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ తెలిపారు. సోమవారం ఏరియా జిఎం కార్యాలయంలో నిర్వహించిన విజిలెన్స్ అవగాహన వారోత్సవాల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిఎం రాధాకృష్ణ మాట్లాడుతూ, కేంద్ర విజిలెన్స్ కమిషన్ ఆదేశాల మేరకు దేశంలోని అన్ని ప్రభుత్వరంగ సంస్థలలో అక్టోబర్ 27 నుండి నవంబర్ 2 వరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు, అందులో భాగంగా సింగరేణి సంస్థలో సైతం అన్ని గనులు, విభాగాలలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర విజిలెన్స్ కమిషన్ ఆదేశానుసారం 1987 వ సంవత్సరంలో సింగరేణిలో విజిలెన్స్ విభాగం ఏర్పాటు చేసినట్లు, చీఫ్ విజిలెన్స్ అధికారి, బి వెంకన్న ఐఆర్టిఎస్ ఆధ్వర్యంలో ఈ విభాగం పనిచేస్తుందన్నారు. అవినీతికి వ్యతిరేకంగా ఉద్యోగులందరినీ చైతన్యపరచి, దేశ ప్రగతికి అవరోధమైనా అవినీతి నిర్మూలనలో వారిని భాగస్వామ్యం చేయడమే వారోత్సవాల ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. సింగరేణిలో జరుగు అక్రమాలను విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేయగలరని, వారి వివరాలను గోప్యంగా ఉంచబడతాయన్నారు. అవినీతి వలన దేశానికి, సంస్థలకు జరుగు నష్టాలను గుర్తించి, అక్రమాలకు వ్యతిరేకంగా పోరాడినప్పుడే అవినీతిని అంతం చేయగలమని తెలిపారు. వారోత్సవాల సందర్భంగా కార్మికులకు, అధికారులకు వ్యాసరచన పోటీలు, సింగరేణి పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు వకృత్వ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం విజిలెన్స్ సమగ్రత ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటు జిఎం విజయ్ కుమార్, గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ, ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, సిఎంఓఏఐ ఏరియా జాయింట్ కార్యదర్శి రవి, సీనియర్ పిఓ సత్యనారాయణ, జిఎం కార్యాలయ ఉన్నత అధికారులు, హెచ్వోడీలు, అధికారులు, ఉద్యోగులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## నూతన పార్కింగ్ షెడ్ నిర్మాణానికి భూమి పూజ



**ధర్మఘంట, మందమర్రి అక్టోబర్ 27:** సింగరేణి ఏరియాలోని ఏరియా వర్క్ షాప్ కార్మికుల సౌకర్యార్థం నూతన పార్కింగ్ షెడ్ నిర్మాణానికి సోమవారం భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వర్క్ షాప్ డివైజిఎం దూప్ సింగ్, గుర్తింపు కార్మిక సంఘం ఏఐటియుసి బ్రాంచ్ ఉపాధ్యక్షుడు భీమనాథుని సుదర్శన్ లు ముఖ్యఅతిథులుగా హాజరై, పూజా కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. అనంతరం భీమనాథుని సుదర్శన్ మాట్లాడుతూ, వర్క్ షాప్ ఆవరణలో ఇదివరకు ఉన్న వాహనాల పార్కింగ్ షెడ్ సరిపోవడం లేదని, నూతనంగా మరో పార్కింగ్ షెడ్ నిర్మాణం చేపట్టాలని గుర్తింపు సంఘం ఏఐటియుసి ఆధ్వర్యంలో యాజమాన్యానికి ప్రతిపాదించగా, ఏఐటియుసి ప్రతిపాదన మేరకు ఏరియా అధికారులు నూతన పార్కింగ్ షెడ్ నిర్మాణానికి పనులు చేపట్టడం జరిగిందన్నారు. గుర్తింపు సంఘం ఏఐటియుసి కార్మికుల హక్కుల సాధన తో పాటు కార్మికుల సంక్షేమానికి నిర్విరామంగా కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్క్ షాప్ ఇంజనీర్లు, అధికారులు సత్య గౌడ్, సదానందం, నాగుల శ్రీనివాస్, ఏఐటియుసి పిట్ కార్యదర్శి సిహెచ్పి శర్మ, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్ ములకలపల్లి వెంకటేశ్వర్లు, తోట వెంకటస్వామి, యూనియన్ నాయకులు ఈ రాజేశ్వరరావు, పారిపెల్లి రాజేశం, వర్క్ షాప్ సిబ్బంది జాడి సంతోష్, రాజ్ కుమార్, వివిధ కార్మిక సంఘాల నాయకులు వై శ్రీనివాస్, చంద్రశేఖర్, భాస్కర్, తోట రాజిరెడ్డి లు పాల్గొన్నారు.

# లక్కీ డ్రా ద్వారా మద్యం దుకాణాల కేటాయింపు





**ధర్మఘంట, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 27:** నూతన మద్యం పాలసీ విధానం ప్రకారం లక్కీ డ్రా పద్ధతిన మద్యం దుకాణాలు కేటాయించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ మండలం శ్రీరాంపూర్ లో గల పివిఆర్ గార్డెన్స్ లో నిర్వహించిన లక్కి డ్రా కార్యక్రమానికి ఆబ్కారీ, మద్య నిషేధ శాఖ అధికారి నంద గోపాల్, మంచిర్యాల ఎసిపి ప్రకాష్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నూతన మద్యం పాలసీ విధానం ద్వారా దుకాణాలు కేటాయించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో మద్యం దుకాణాల కొరకు 1 వేయి 712 దరఖాస్తులు వచ్చాయని, 73 దుకాణాలకు లక్కీ డ్రా తీయడం జరిగిందని తెలిపారు. నూతన మద్యం పాలసీ నియమ, నిబంధనలను అనుసరిస్తూ ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా ఏర్పాట్లు చేయడం జరిగిందని, దుకాణాల వారీగా దాఖలైన దరఖాస్తులకు సంబంధించిన దరఖాస్తుదారుల సమక్షంలో లక్కీ డ్రా తీస్తూ మద్యం దుకాణాల కేటాయింపును ఖరారు చేయడం జరిగిందని, లక్కీ డ్రా కోసం వినియోగించిన టోకెన్ లను అందరికీ చూపిస్తూ, పారదర్శకంగా ప్రక్రియ ప్రారంభం నుండి చివరి వరకు ఫోటో, వీడియో చిత్రీకరణ చేయడం జరిగిందని, టోకెన్ కలిగి ఉన్న వారిని మాత్రమే లోపలికి అనుమతించడం జరిగిందని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పరిసర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. దుకాణం పొందిన వారు నిబంధనలను అనుసరిస్తూ, లైసెన్స్ ఫీజు రూపణా నిర్ణీత రుసుము చెల్లించేందుకు వీలుగా వేదిక వద్దనే అవసరమైన కౌంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి చంద్రయ్య





**ధర్మఘంట, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 27:** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి చంద్రయ్య తెలిపారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు తో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మంచిర్యాల పట్టణంలోని హమాలివాడ, సూర్యనగర్ కాలనీ వాసులు గత కొద్ది రోజులుగా తమ కాలనీకి నల్లా నీరు రావడం లేదని, నీటిని అందించాలని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణానికి చెందిన భూపతి జగన్ మోహన్ తన తండ్రి పేరిట గల భూమిని ఆయన మరణించినందున తన పేరిట పట్టా మార్పు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల మండలం వేంపల్లి గ్రామానికి చెందిన రాయిలి సత్యం తాను తన భూమి హద్దుగా కొలత కొరకు దరఖాస్తు చేసుకున్నానని, సర్వే చేయించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కాసిపేట మండలం ధర్మారావుపేట గ్రామానికి చెందిన నేతుల సత్తయ్య తనకు వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి మండల కేంద్రానికి చెందిన జె బాలక్క, ఎస్సి కాలానికి చెందిన ఎన్ లక్ష్మి, భూపెల్లి లావణ్య లు తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ వేరువేరుగా అర్జీలు సమర్పించారు. బెల్లంపల్లి రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ప్రతినిధులు తమ దరఖాస్తులో సేంద్రీయ ఉత్పత్తుల అవుట్ లెట్ కొరకు స్థలం కేటాయించాలని కోరారు. నెన్నెల మండలం నందులపల్లి గ్రామానికి చెందిన ఇందూరి కిష్టయ్య తన కుమారుడు తన భూములు లాక్కొని ఇంటి నుంచి బయటకు వెళ్లగొట్టాడని, తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆకాశమంతా అమ్మ
## "అ" తో మొదలయ్యేదే అమ్మ
## నీతో పుడుడుపోసుకుందే నా జన్మ

చేతులే ఉయ్యాలగా
కొంగునే గొడుగుగా
తన ఊపిరినే శ్వాసగా చేసింది
రక్తాన్ని పాలుగా చేసి సాదుకున్నది
వొళ్ళంతా జ్వరం వస్తే
దిష్టి తీస్తుంది
అప్పుడప్పుడు అమ్మే నర్సు అయితది.



విసుగు విరామం లేకుండా
మా ఇంటి దీపం వెలిగించడానికి
రోజు కుట్టు మిషన్ కుడుతుంది
చినిగిన జీవితపు పేలికల్ని
తెగిపోకుండా ప్రేమదారంతో
అల్లి కుడుతుంది.

సగం కల సగం మెళుకువతో
అనేక దుఃఖాలకు అలవాటైన
అమ్మ తలకింది మెత్త
ఎన్ని సార్లు తడిసిందో?

గుక్కపెట్టి ఏడ్చినప్పుడు
ఓదార్చే భాష అమ్మేకే తెలుసు
నన్ను నవ్వించడానికి అమ్మే ఆట
వస్తువు అవుతుంది.

కొలువలేని ఆనందం తో
తృప్తితిరా ముద్దాడుతుంది.
మా అమ్మ ఎప్పటికి పాతబడని
ఆకాశం.

నా జీవితానికి మా అమ్మే
ముందుమాట
ఎగిరే జెండాల నన్ను ఎప్పటికి
మోస్తూనే ఉంది
తన గుండెల మీద.



రచయిత్రి
యం. మమత
బి.ఏ. మొదటి సంవత్సరం
ప్రభుత్వ డిగ్రీ కళాశాల
నారాయణఖేడ్

# రారండోయ్ వేడుక చే(చూ)ద్దాం!



ఖమ్మం

ఉమ్మడి ఖమ్మంజిల్లా ముద్దుబిడ్డ... లెజండరీ లీడర్ తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పుట్టిన రోజు వేడుకలను ఈనెల 28వ తేదీన మంగళవారం (రేపు) నిర్వహించేందుకు ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని ఊరువాడా

**రేపు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పుట్టినరోజు**
**ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సేవా కార్యక్రమాలకు పిలుపు**
**సర్వం సిద్ధం చేసిన శీనన్న అభిమానులు**
**రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు, బైక్ ర్యాలీలతో హోరెత్తించేందుకు సిద్ధం**
**వేడుకల వివరాలను వెల్లడించిన తుంబూరు దయాకర్ రెడ్డి**

సిద్ధం అయ్యింది. కాంగ్రెస్ నేతలు, పొంగులేటి అభిమానులు సేవా కార్యక్రమాలకు పిలుపునిచ్చారు. రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు, బైక్ ర్యాలీలతో ఉమ్మడిజిల్లాను హొరెత్తించేందుకు సిద్ధం అయ్యారు. భారీ కటౌట్లు, ఫ్లెక్సీలు, హోర్డింగ్ లను పురవీధుల్లో ఇప్పటికే ఏర్పాటు చేశారు. కాగా ఈ వేడుకలకు సంబంధించిన వివరాలను క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి వెల్లడించారు. ఉదయం 09 గంటలకు ఖమ్మం క్యాంపు కార్యాలయంలో భారీ కేక్ కటింగ్, రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా నేలకొండపల్లిలో వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి బైక్ ర్యాలీ ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 09.30గంటలకు వరంగల్ క్రాస్ రోడ్డులో, ఉదయం 10గంటలకు కల్లూరు పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ లో కేక్ కటింగ్ ఉంటుందన్నారు. ఉదయం 11 గంటలకు ముదిగొండ మెయిన్ సెంటర్ లో అన్నదాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 11.30గంటలకు కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో కేక్ కటింగ్, మధ్యాహ్నం 12గంటలకు ఖానాపురంలోని శ్రీ అభయ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అయ్యప్పస్వాములకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఇవేకాక ఇంకా అనేక ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. కావున ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని పొంగులేటి శీనన్న అభిమానులు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలందరూ ఆయా ప్రాంతాల్లో జరిగే వేడుకలు, సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యులవ్వాలని దయాకర్ రెడ్డి కోరారు.

# ఇందిరమ్మ ఇండ్ల చెల్లింపుల్లో స్వల్ప మార్పులు : మంత్రి పొంగులేటి

హైదరాబాద్, 27 అక్టోబర్ (ధర్మఘంట)

ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్దిదారులకు నాలుగు విడతలుగా అందచేస్తున్న బిల్లుల చెల్లింపుల ప్రక్రియలో ప్రభుత్వం స్వల్ప మార్పులు చేసినట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద 90 పని దినాలు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం (ఐహెచ్ హెచ్ఎల్ ) పనులను చేసుకోడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చినందున ఈ మార్పు అనివార్యమైందని ఆయన తెలిపారు. కేవలం చెల్లింపుల షెడ్యూల్ లో మాత్రమే మార్పులు జరుగుతున్నాయి తప్పితే, లబ్ధిదారులకు మంజూరు చేసే రూ. 5 లక్షల మొత్తంలో ఎలాంటి మార్పు ఉండదని మంత్రి స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో బేస్ మెంట్



వరకూ నిర్మాణం పూర్తి అయితే ఒక లక్ష రూపాయలు, రూఫ్ లెవల్ వరకు వచ్చిన తరువాత మరో లక్షరూపాయలు విడుదల చేస్తున్నారు. అలాగే ప్రస్తుతం రూఫ్ పూర్తి అయిన తరువాత లబ్దిదారులకు రూ.2 లక్షలను చెల్లిస్తున్నారు. ఉపాధి హామి పథకం ద్వారా కలుగుతున్న లబ్ది (90 రోజుల పనిదినాల మొత్తం, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం నిమిత్తం నిర్దేశించిన మొత్తం) వారి ఖాతాల్లోకే నేరుగా జమ అవుతుంది, ఈ నేపథ్యంలో లబ్ధిదారులు ఇంటి శ్లాబ్ వేసిన తరువాత చెల్లించే మొత్తాన్ని రూ.1.40 లక్షలుగా అందేచేయాలని ప్రభుత్వం నిర్ణయించనట్లు మంత్రి వివరించారు. ఇకపై శ్లాబ్ పూర్తి అయిన తరువాత రూ.1.40 లక్షలను మాత్రమే లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతాయని, మిగిలిన మొత్తాన్ని (రూ.60 వేలను) కూడా లబ్దిదారుల ఖాతాల్లో ఉపాధి హామీ పథకం కింద అందచేస్తారని తెలిపారు. అట్లాగే ఇంటి నిర్మాణం పూర్తి అయిన తరువాత మిగిలిన లక్ష రూపాయలను విడుదల చేస్తారు. పరిపాలనా సౌలభ్యం రీత్యా ఈ మార్పులు అనివార్యమయ్యాయని, లబ్ధిదారులు ఈ మార్పును గమనించి ప్రభుత్వంతో సహకరించాల్సిందిగా మంత్రి కోరారు.

# ఆటో డ్రైవర్లకు అండగా బీఆర్ఎస్ పార్టీ

## అంబర్ పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్





హైదరాబాద్, 27 అక్టోబర్ (ధర్మఘంట):

రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్ ప్రయాణ సదుపాయం కల్పించిన నేపథ్యంలో, హైదరాబాద్ నగరంలోని ఆటో డ్రైవర్లు తీవ్రమైన నష్టాన్ని ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలను అర్థం చేసుకొని సంఘీభావంగా ఉండేందుకు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి.రామారావు పిలుపు మేరకు అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మరియు ఆయన సతీమణి కాలేరు పద్మ, అంబర్‌పేట్ కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ ఆయన సతీమణి ఇ.స్రవంతి, బాగ్ అంబర్‌పేట్ కార్పొరేటర్ పద్మ వెంకట్ రెడ్డి, ఈరోజు ఫీవర్ హాస్పిటల్ క్రాస్ రోడ్ నుండి బాగ్ అంబర్‌పేట్ రెడ్ బిల్డింగ్ వరకు కుటుంబ సమేతంగా ఆటోలో ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆటో డ్రైవర్లతో మాట్లాడుతూ "ఆటో డ్రైవర్లు ఎవ్వరూ ఆత్మహత్యకు పాల్పడవద్దు. ఆటో డ్రైవర్లకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ఉంటుంది" అని తెలిపారు. ప్రస్తుత ఉచిత బస్ సౌకర్యం కారణంగా ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు తీవ్రమైనవని ఆయన పేర్కొంటూ, ప్రభుత్వం తక్షణమే ఆటో డ్రైవర్లకు వాగ్దానం చేసిన ?12,000 ఆర్థిక సహాయం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. "ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే ఆటో డ్రైవర్లతో కలిసి అసెంబ్లీని ముట్టడిస్తాం" అని ఎమ్మెల్యే హెచ్చరించారు

# నూతన భవనాలకు శంకుస్థాపన

## భూమి పూజలో రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

యాదాద్రి భువనగిరి, 27 అక్టోబర్ (ధర్మఘంట):





యాదాద్రి భువనగిరిజిల్లా ఆలేరు నియోజకవర్గంలోని మోటకొండూరు మండల కేంద్రంలో కొత్త తహశీల్దార్ కార్యాలయం, ఎంపిడిఓ కార్యాలయం మరియు పోలీస్ స్టేషన్ భవనాల నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నిర్వహించారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,ప్రజలకు సమీపంలోనే ప్రభుత్వ సేవలు అందేలా సదుపాయాలు కల్పించడం తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం పరిపాలనా వ్యవస్థను మరింత బలపరిచే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు.. త్వరలోనే ఈ నూతన భవనాలు పూర్తి అయ్యి ప్రజా సేవకు అంకితం కానున్నాయని, మోటకొండూరు మండల ప్రజలకు ఆధునిక సౌకర్యాలతో కూడిన ఈ కార్యాలయాలు ఎంతో ఉపయోగపడతాయని మంత్రి పేర్కొన్నారు.

**రైతుల సమస్యల పరిష్కారంపై**
**జిల్లా అధికారులతో సమీక్ష**

భువనగిరి జిల్లా కలెక్టరేట్‌లో నేడు వరిధాన్యం సేకరణ, పత్తి కొనుగోలు, రైతుల సమస్యల పరిష్కారంపై జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతుల పంటలకు న్యాయమైన ధర లభించేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని, ధాన్యం సేకరణ కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పత్తి కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని, వర్షాల కారణంగా పంట నష్టపోయిన ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. రైతుల కష్టానికి తగిన ఫలితం అందేలా ప్రతి రైతు ధాన్యం, పత్తి ప్రభుత్వ ఆధ్వర్యంలో సకాలంలో కొనుగోలు అవ్వాలన్నది ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

## అవినీతి నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత



ధర్మఘంట, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 27:

దేశంలో, సంస్థలో నెలకొన్న అవినీతిని నిర్మూలించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లాలోని సింగరేణి మందమర్రి ఏరియా కాసీపేట 1 గని మేనేజర్ డి సతీష్, గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్ లు తెలిపారు. సోమవారం కాసీపేట 1 గనిపై సోమవారం నిర్వహించిన విజిలెన్స్ వారోత్సవాల కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విజిలెన్స్ సమగ్రత ప్రతిజ్ఞ చేశారు. అనంతరం సతీష్ మల్లేష్ లు మాట్లాడుతూ, కేంద్ర విజిలెన్స్ కమిషన్ ఆదేశాల మేరకు దేశంలోని అన్ని ప్రభుత్వ రంగ సంస్థలలో అక్టోబర్ 27 నుండి నవంబర్ 2 వరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తుండగా, అందులో భాగంగా సింగరేణిలో సైతం విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఉద్యోగులలో, సామాన్య ప్రజలలో, సంస్థ భాగస్వాములలో పారదర్శకత, నిజాయితీ, మంచి నైతిక ప్రవర్తన వంటి వాటి ప్రాముఖ్యత గురించి అవగాహన తీసుకురావడానికి విజిలెన్స్ మన అందరి ఉమ్మడి బాధ్యత అనే నినాదంతో ఈ సంవత్సరం కేంద్ర విజిలెన్స్ విభాగం అవగాహన వారోత్సవాలను నిర్వహిస్తుందన్నారు. అవినీతికి వ్యతిరేకంగా అందరి భాగస్వామ్యంతో చేపట్టే ఈ కార్యక్రమాలలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు ప్రధానమైనవని, దీంతో అవినీతి వ్యతిరేక పోరాటాన్ని ప్రచారం చేయడానికి వీలు కలుగుతుందన్నారు. లంచం మొదలగు వాటి నిర్మించాల్సిన అవసరం నేటి సమాజంలో ఎంతైనా ఉందని, అదేవిధంగా పరిపాలనలో నీతి, పారదర్శకత ఆవశ్యకత గురించి అందరిలో అవగాహన తీసుకురావడానికి విజిలెన్స్ వారోత్సవాలను ప్రముఖ భూమిక పోషిస్తాయని తెలిపారు. ఉద్యోగులందరూ చురుకైన భాగస్వామ్య మద్దతుతో సింగరేణిలో అవినీతి నిర్మూలించడానికి విజిలెన్స్ విభాగం ఎల్లవేళలా ప్రయత్నిస్తుందని తెలిపారు. ఉద్యోగులందరూ విజిలెన్స్ వారోత్సవాల్లో భాగస్వాములై, విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గని రక్షణ అధికారి నిఖిల్ అయ్యర్, వెంటిలేషన్ అధికారి హిమాలయ, ఇంజనీర్, సర్వే అధికారి, సంక్షేమ అధికారి, ఓవర్ మెన్ మురళి, ఏఐటియుసి అసిస్టెంట్ పిట్ కార్యదర్శి పార్వతీ సురేష్, ఆడే రవీందర్, గని అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పూర్తి స్థాయిలో సదుపాయాల కల్పన
## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్






ధర్మఘంట, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 27:

ప్రభుత్వం విద్యార్థుల సౌకర్యార్థం అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తూ పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పిస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్ నగర్ ప్రాంతంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి తరగతి గదులు, వంటశాల, రిజిస్టర్లు, మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పూర్తిస్థాయిలో సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ మధ్యాహ్నం భోజనంలో పౌష్టిక ఆహారాన్ని అందిస్తుందని, ఈ క్రమంలో విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించిందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులలో పాఠ్యాంశాలు బోధించి వారి అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలకు
## మాజీ మంత్రి హరీష్ రావు క్షమాపణలు చెప్పాలి

**ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి**

హైదరాబాద్ 27 అక్టోబర్ (ధర్మఘంట):



మాజీ మంత్రి బిఆర్ఎస్ సిద్దిపేట్ ఎమ్మెల్యే హరీష్ రావు ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలకు క్షమాపణలు చెప్పాలని ఓయూ జెఏసి చైర్మన్ కొత్తపల్లి తిరుపతి డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే హరీష్ రావు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ క్యాబినెట్ ను అవమానపరుస్తూ మాట్లాడడం అత్యంత బాధాకరమని కొత్తపల్లి తిరుపతి మండిపడ్డారు. క్యాబినెట్ అంశాలను బహిరంగంగా చర్చిద్దాం అంబేద్కర్ విగ్రహం దగ్గరికి రమ్మని ఎమ్మెల్యే హరీష్ రావుకు ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్డూరు లక్ష్మణ్ సవాల్ విసిరారు. చర్చకు రాకుండా హరీష్ రావు వారి ఎమ్మెల్యేను పంపిస్తామని చెప్పడం సిగ్గుమాలిన చర్య అని అభిప్రాయపడ్డారు. బంజారాహిల్స్ మినిస్టర్ వసతి గృహంలో మంత్రి అడ్డూర్ లక్ష్మణ్ మీడియా సమావేశంలో కొత్తపల్లి తిరుపతి' ఓయూ జేఏసీ మరియు బహుజన విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొని మంత్రికి మద్దతు తెలిపారు.

## హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఎన్నికల్లో టియుడబ్ల్యుజె (ఐజెయు)

# బలపరిచిన ఫ్రెండ్స్ ప్యానెల్ విజయ దుంధుభి







సోమాజిగూడ ప్రెస్ క్లబ్ ఎన్నికలలో ఫ్రెండ్స్ ప్యానెల్ విజయ దుందుభి

హైదరాబాద్, అక్టోబర్ 27 (ధర్మఘంట)

ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగిన హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఎన్నికల్లో ఫ్రెండ్స్ ప్యానెల్ ఘన విజయం సాధించింది. ప్రొఫెషనల్ జర్నలిస్టులు , యూనియనిస్టులు ఫ్రెండ్స్ ప్యానెల్ తరపున అభ్యర్థులుగా పోటీ చేశారు. ఫ్రెండ్స్ ప్యానెల్ కు ఐజేయూ అనుబంధ సంఘం %ఖఔజీ(×జీఖ%), స్మాల్ పేపర్స్ అసోసియేషన్ తమ సంపూర్ణ మద్దతును ఇచ్చింది. మొత్తం 17 స్థానాలకు గాను ఫ్రెండ్స్ ప్యానెల్ 12 స్థానాలను కైవసం చేసుకున్నది. ఆఫీస్ బేరర్ స్థానాలు ఏడింటికి గాను ఆరు స్థానాలలో కార్యవర్గం 10 స్థానాలకు గాను ఆరు స్థానాలలో ఫ్రెండ్స్ ప్యానెల్ గెలుపొందింది. అధ్యక్షునిగా ఎస్. విజయకుమార్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎ.రాజేష్, అరుణ అత్తలూరి, ప్రధాన కార్యదర్శిగా వరికుప్పల రమేష్, సహాయ కార్యదర్శిగా చిలుకూరి హరిప్రసాద్, కోశాధికారిగా వైట్ల రమేష్ ఘనవిజయం సాధించారు. ఫ్రెండ్స్ ప్యానెల్ తరపున విజేతలుగా నిలిచిన మిత్రులు ధన్యవాదాలు తెలిపారు.

# స్టువర్ట్‌పురం దొంగలకు మించిన బంధి పోట్లు





- మేము కాదు దండుపాళ్యం బ్యాచ్ మీరే
- బందిపోటు దొంగలకు మించిన దొంగలు మీరే
- కేటీఆర్, హరీష్ రావు లపై మంత్రి అడ్లూరి ఫైర్
- జూబ్లీహిల్స్ మినిస్టర్ క్వార్టర్స్‌లో మీడియా సమావేశం
- పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి వర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీ అనిల్ యాదవ్, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, మందుల సామేలు, ఎమ్మెల్సీలు బల్మూరు వెంకట్, అద్దంకి దయాకర్



హైదరాబాద్, 27 అక్టోబర్ ధర్మఘంట:

పదేళ్లు రాష్ట్రాన్ని దోచుకొన్న స్టువర్ట్‌పురం దొంగలకు మించిన బంధి పోట్లు బీఆర్ఎస్ నాయకులని తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి వర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. నేడు జూబ్లీహిల్స్ మినిస్టర్ క్వార్టర్స్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేటీఆర్, హరీష్ రావు కాంగ్రెస్ కేబినెట్‌ను "దండుపాళ్యం బ్యాచ్" అని పిలవడం దురదృష్టకరం... సిగ్గు చేటు.. అని, మేము కాదు దండుపాళ్యం బ్యాచ్... మీరు పదేళ్లు రాష్ట్రాన్ని దోచుకొని స్టువర్ట్‌పురం దొంగలకు మించిన బంధి పోట్లు అని దుయ్యబట్టారు. మీరు పది ఏళ్లు మంత్రిగా ఉండి దండుపాళ్యం బ్యాచ్ ను నడిపించింది నువ్వు , నీ బామర్ది, మీ మామ కేసీఆర్ లు దండుపాళ్యం ముఠా నాయకులు.. కాబట్టి మీరే దండుపాళ్యం ముఠా సభ్యులు అని అన్నారు. నేను చేసిన సవాలుకు తోక ముడిచావని, దమ్ముంటే నా సవాలును నువ్వే స్వీకరించని, ఎవరినో పంపించడం కాదు మీరే చర్చలకు రావాలని కౌంటరిచ్చారు. దళితులు, బలహీన వర్గాలు ఉన్న క్యాబినెట్‌ను అవమానపరచడం సిగ్గుచేటని, ఇది కేవలం ప్రభుత్వాన్ని కాదు .. తెలంగాణ దళితులను అవమానపరచడమని ఆవేదన చెందారు. సిద్ధిపేట దేవాలయంలో చర్చకు సవాల్ విసిరినప్పుడు రానని తోక ముడిచావు, హరీష్ రావు ఎమ్మెల్యేలకు ఫండ్లు ఇవ్వలేదని మీ మరదలు కవితే చెప్పింది నిజం కాదా? కేబినెట్ విషయాలు వ్యక్తిగత దురుద్దేశాలతో బయటపెడుతున్నావని, ధైర్యం ఉంటే, మళ్లీ రా – ప్రజల ముందే చర్చిద్దాం అని, హరీష్ రావు కు సవాల్ విసిరారు.

**దళితుల మీద తుపాకులు పెట్టి బెదిరించిన రోజులు గుర్తున్నాయా హరీష్ రావు?**

ఇక తెలంగాణ ప్రజలు భయపడే రోజులు లేవని, మేము కేసీఆర్ లాంటి వెన్నుపోటు రాజకీయాలు చేయమని, నేను కాంగ్రెస్ జెండా, ప్రజా విశ్వాసం మీద నిలబడిన వాడినని, మీరు పదేళ్లు "మేమే రాజులు %–% మేమే మంత్రులు" అంటూ పాలించారు. ఇప్పుడు ప్రజలు మీకు తీర్పు ఇచ్చారని, హరీష్ రావు, కేటీఆర్ లు ఇంకా రాజుల్లా ఫీల్ అవుతున్నారు, కానీ ప్రజలు డిసెంబర్ 2023లోనే మిమ్మల్ని భూస్థాపితం చేశారన్నారు. ఇప్పుడు నీ పార్టీ లేదు హరీష్ ు నీ అయ్యా తరమూ లేదు. ప్రజలు మీ పార్టీని పాతాళానికి నెట్టేశారు! మంత్రి వర్గాన్ని దండుపాళ్యం అంటావా? అసలు ఈ రాష్టాన్ని దోచుకున్నది మీరే ు మీరు "స్టువర్ట్‌పురం దొంగలకంటే మించిన బందిపోట్లు!" కాళేశ్వరం అవినీతి, అసైనెడ్ భూముల కబ్జా, లిక్కర్ దందాలు ఇవన్నీ దండుపాళ్యం కంటే ఘోరమైన దోపిడీలు. నీ చెల్లి కవిత తీహార్ జైలులో ఎందుకుందో ప్రజలందరికీ తెలుసు, మీరు దోచుకున్నదంతా న్యాయస్థానం ముందు బయటపడుతుంది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రజా పాలన అందిస్తున్నారు. మంత్రులను గౌరవిస్తున్నారు. కేసీఆర్ లాంటి అధికారం దుర్వినియోగం లేదు. మా కేబినెట్‌లో ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛ ఉంది. మీరు ప్రగతిభవన్ గేట్ల దగ్గరే మంత్రులను నిలిపి, గోస పెట్టినవారు. మీ యాసతో అబద్ధాలకే శక్తి తెస్తున్నావు. కానీ ఇప్పుడు ప్రజలు వాస్తవాలు తెలుసుకున్నారు. మేము ఆరు గ్యారంటీలలో నాలుగు అమలు చేశాం మీ అప్పుల మధ్య కూడా అభివృద్ధి, సంక్షేమం కొనసాగిస్తున్నాం. సీఎం రేవంత్ రెడ్డి మీద దురుద్దేశాలు ఆపాదించడం ఆపు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలను సమానంగా చూసే ప్రభుత్వం మాది. నేను దళితున్ని, సాధారణ కార్యకర్త స్థాయి నుండి జిల్లా పరిషత్ చైర్మన్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎదిగాను. రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి ఆశీస్సులతో ఈ స్థాయికి వచ్చాను. మంత్రి వర్గం, సీఎంపై చేసిన వ్యాఖ్యలపై మీరు బహిరంగంగా క్షమాపణ చెప్పాలి. లేకపోతే ప్రజలే సమాధానం చెబుతారు. కేటీఆర్, హరీష్ రావు మీరే బందిపోట్లు, దోపిడీదారులు! అని అన్నారు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సవాల్‌ను స్వీకరించకుండా పారిపోయిన హరీష్ రావు ఇప్పుడు ప్రజల ముందుకు వచ్చి క్షమాపణ చెప్పాలని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని తప్పుదారి పట్టించడానికి డ్రామాలు చేస్తున్నారని ఈ డ్రామాలు ఇక నడవవు అని హెచ్చరించారు

## వొడాఫోన్ ఐడియాకు సుప్రీంలో భారీ ఊరట

సవరించిన స్థూల ఆదాయం (ఏజీఆర్) బకాయిల లెక్కింపు వ్యవహారంలో ప్రముఖ టెలికాం సంస్థ వొడాఫోన్ ఐడియాకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. 2016–17 వరకు బకాయిల కోసం టెలికాం విభాగం (డాట్) ఇచ్చిన అదనపు పన్ను డిమాండ్‌లపై కంపెనీ చేస్తోన్న అభ్యంతరాలను పరిశీలించేందుకు కేంద్రానికి అత్యున్నత న్యాయస్థానం అనుమతి ఇచ్చింది. డాట్ తాజా పన్ను డిమాండ్‌ను రద్దు చేయాలని కోరుతూ వొడాఫోన్ ఐడియా వేసిన పిటిషన్‌పై కోర్టు ఈ ఉత్తర్వులు జారీ చేసింది. 2016–17 కాలానికి అదనపు ఏజీఆర్ చెల్లించాల్సిందిగా డాట్ ఇటీవల కంపెనీకి నోటీసులు ఇచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరానికి గానూ.. రూ.5,606 కోట్ల అదనపు పన్నును డిమాండ్ చేసింది. అంతేగాక, 2018–19 వరకు ఐడియా సెల్యులార్ గ్రూప్, వొడాఫోన్ ఐడియా కోసం లైసెన్సు ఫీజు బకాయిల మొత్తాన్ని కూడా సవరించింది. దీంతో కంపెనీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఏజీఆర్ బకాయిలపై సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పు పరిధిని దాటి డాట్ పన్ను డిమాండ్ చేస్తోందని కంపెనీ వాదించింది. తాజా పన్ను డిమాండ్‌ను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని అభ్యర్థించింది. ఈ విచారణ సందర్భంగా కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదిస్తూ.. "వొడాఫోన్ ఐడియాలో ప్రభుత్వానికి 49శాతం వాటా ఉంది. దాదాపు 20 కోట్ల మంది వినియోగదారులు ఈ సేవలపై ఆధారపడ్డారు.







## రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ధర్నా

### ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కట్టెల శివకుమార్ సంఘీభావం




నల్లగొండ, 27 అక్టోబర్ (ధర్మఘంట):

జిల్లా కలెక్టరేట్ నందు రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ చేస్తున్న ధర్నాకి ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కట్టెల శివకుమార్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగొండ జిల్లా కలెక్టరేట్ నందు నెలలుగా బకాయి ఉన్న ఎనిమిది వేల కోట్ల రూపాయల రిటైర్డ్ ఎంప్లాయిస్ బకాయిలు విడుదల చేయాలని ఐఆర్డిఏ పెండింగ్ లో ఉన్న వాటి మొత్తాన్ని వెంటనే రిటైర్డ్ ఎంప్లాయిస్ కుటుంబాలకు అందించే విధంగా చూడాలని ఎంతోమంది రిటైర్డ్ ఎంప్లాయిస్ వారి కుటుంబాలు జీవన సరళి గడవక పిల్లల పెళ్లిలు లేక ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు ఉన్నాయి కావున వెంటనే రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఎంప్లాయిస్ వారి బకాయిలు వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర అధ్యక్షులు కొంపెల్లి బిక్షపతి నేతృత్వంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టి ప్రభుత్వాన్ని ప్రశ్నించడం జరిగుతుందని దానికి తెలంగాణ ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం సంపూర్ణ మద్దతుతో ఇస్తుందని సంఘీభావం తెలిపారు. రానున్న రోజుల్లో రావాల్సిన బిల్లులు వెంటనే ఇవ్వకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి, ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం గౌరవ సలహాదారులు కందుల విజయ్ కుమార్, జిల్లా నాయకులు కాసర్ల లింగస్వామి, రాష్ట్ర కార్యదర్శి బాకీ తరుణ్, సెంట్రల్ కమిటీ మెంబర్ కొండేటి నరేష్ కుమార్ మరియు రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు జానీ మియా, జంగయ్య, వెంకటరెడ్డి, బిక్షం రెడ్డి, మరియు ముజాహిద్దీన్ తదితరులు పెద్ద మొత్తంలో పాల్గొనడం జరిగింది.

## బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి చేరిక

### పార్టీలోకి ఆహ్వానించిన స్థానిక శాసనసభ్యులు కుందూరు జయవీర్ రెడ్డి





నాగార్జునసాగర్, 27 అక్టోబర్ (ధర్మఘంట)

ప్రజా ప్రభుత్వం చేస్తున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై నిడమనూరు మండలం, వెనిగండ్ల గ్రామ సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు, మాజీ సర్పంచ్ మరియు మాజీ ఎంపిటిసి పోలే డేవిడ్ ఆధ్వర్యంలో ఉపసర్పంచ్ ముదిగండ్ల నాగయ్య, ఉపసర్పంచ్ చింతమల్ల పాండు రంగయ్య, వార్డు మెంబర్లు, వివిధ గ్రామాలలోని తన అనుచరులతో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరారు. స్థానిక శాసనసభ్యులు కుందూరు జయవీర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు.

## కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ని భారీ మెజారితో గెలిపించాలి

## నవీన్ యాదవ్ సతీమణి వర్షా యాదవ్






హైదరాబాద్, 27 అక్టోబర్ (ధర్మఘంట)

జూబ్లీహిల్స్ నియోజకవర్గం వెంగళరావు నగర్ డివిజన్ మధురానగర్ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ తరఫున ఇంటింటి ప్రచారంలో భాగంగా నేడు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్ సతీమణి వర్షా యాదవ్ పాల్గొన్నారు.. ఈ సందర్భంగా ఆమె స్థానిక ప్రజలను ఆప్యాయంగా కలుసుకొని, వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రజల నుండి మంచి ఆదరణ లభించగా నవంబర్ 11న జరిగే ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుపైన ఓటు వేసి నవీన్ యాదవ్ ని భారీ మెజారితో గెలిపించాలని ప్రజలను కోరారు.. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు, కాంగ్రెస్ సేవాదళ్ సూర్యాపేట జిల్లా మహిళా అధ్యక్షురాలు కేతిరెడ్డి శకుంతల రెడ్డి , రామలీల, సేవాదళ్ కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ సభ్యులు మరియు స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

**తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు డా. రేఖ బోయలపల్లి ఆధ్వర్యంలో...**

జూబ్లీహిల్స్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ కుమార్ యాదవ్ ప్రచారంలో భాగంగా నేడు మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హెచ్. హనుమంతరావు, యశస్విని రెడ్డి, మరియు స్థానిక నాయకులతో కలిసి తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు డా. రేఖ బోయలపల్లి ఆధ్వర్యంలో... బోరబండ డివిజన్‌లో ప్రచారం చేశారు ప్రజలతో మమేకమై కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించి, బూత్ స్థాయి బలంను మరింత పటిష్ఠం చేసారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, నవీన్ యాదవ్ సేవా తత్వంతో కాంగ్రెస్ విజయం ఖాయం! అని ధీమా వ్యక్తంచేశారు.



# సూర్య-46 మూవీలోకి స్టార్ బ్యూటీ ఎంట్రీ

స్టార్ హీరో సూర్య, డైరెక్టర్ ఆర్.జే. బాలాజీ కాంబినేషన్‌లో వస్తున్న లేటెస్ట్ మూవీ 'కరుప్పు'. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ బ్యానర్‌పై రూపొందుతోన్న ఈ చిత్రం వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రాబోతున్నది. ఇక దీంతో పాటు తెలుగులో వెంకీ అట్లూరి దర్శకత్వంలో మరో మూవీ చేయబోతున్న విషయం తెలిసిందే. 'సూర్య-46'అనే వర్కింట్ టైటిల్‌తో రూపొందుతోన్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్స్‌పై నాగవంశీ నిర్మిస్తున్నారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ సినిమాకు జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. వచ్చే ఏడాది షూటింగ్ స్టార్ట్ కాబోతున్న ఈ చిత్రంలో తాజాగా ఓ స్టార్ బ్యూటీ కూడా యాడ్ అయినట్లు ఇచ్చారు మేకర్స్. ఇందులో రవీన్ టండన్ కూడా భాగం కాబోతున్నట్లు తెలుపుతూ.. 'ఎవర్ గ్రీన్ రవీన్ టండన్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు. ూబతీఱఽ46 లోకి మిమ్మల్ని చేర్చుకున్నందుకు చాలా సంతోషంగా ఉంది. మీతో ముందు ముందు ఉండబోయే అద్భుతమైన ప్రయాణం కోసం వేచి చూస్తున్నాము' అని తెలిపారు.

# నయనతారకు మరో ఆఫర్!



నందమూరి బాలయ్య ఏడాదికి రెండు సినిమాలు చేసుకుంటూ ముందుకు దూసుకు వెళ్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం అఖండ 2 సినిమాతో ఫుల్ బిజీగా ఉన్న నందమూరి బాలయ్య, మరో నెలలో కొత్త సినిమా ప్రారంభించనున్నారు.గోపీచంద్ మలినేనితో మరో సినిమా తీసేందుకు బాలయ్య సిద్ధమయ్యారు. 111 అనే వర్కింగ్ టైటిల్ తో వస్తున్న ఈ సినిమా నవంబర్ ఏడో తేదీన పూజా కార్యక్రమాలతో షూటింగ్ ప్రారంభించుకోబోతున్నట్లు టాక్. ఇప్పటికే బాలయ్య-గోపీచంద్ మలినేని కాంబినేషన్ లో వీరసింహారెడ్డి సినిమా వచ్చి సక్సెస్ అయింది. దీంతో మరోసారి గోపీచంద్ కు ఛాన్స్ ఇచ్చాడు నందమూరి బాలయ్య. ఇక ఈసారి మాస్ యాక్షన్ అంశాలతో పాటు రెండు కాలాలకు సంబంధించిన హిస్టారికల్ కథను గోపీచంద్ మలినేని సిద్ధం చేశాడట. టైం ట్రావెల్ లాంటి కథ అని చెబుతున్నారు. ఇందులో కూడా నందమూరి బాలయ్య డబుల్ రోల్ లో కనిపించే ఛాన్సులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇలాంటి నేపథ్యంలో ఈ సినిమా నుంచి మరో గాసిప్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఈ మూవీలో నయనతార హీరోయిన్ గా ఫైనల్ అయినట్లు చెబుతున్నారు. ఇప్పటికే బాలయ్యతో నయనతార చాలా అనే సినిమాలు తీశారు. హిస్టారికల్ కథ కావడంతో బాలయ్య సరసన నయనతార అయితేనే కరెక్ట్ గా ఉంటుందని గోపీచంద్ ఈ నిర్ణయం తీసుకున్నాడట. రెమ్యూనరేషన్ ఎంతైనా ఇచ్చేందుకు చిత్ర బృందం సిద్ధం అయిందని టాక్ వినిపిస్తోంది.



# పరిచయం నుంచి పరిణయం వరకు..

విష్ణు విశాల్ నటిస్తున్న ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ 'ఆర్యన్'. ప్రవీణ్ కె దర్శకత్వంలో విష్ణు విశాల్ స్టూడియోజ్, శుభ్రా, ఆర్యన్ రమేష్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇటీవల విడుదలైన టీజర్, ట్రైలర్ మంచి బజ్ క్రియేట్ చేశాయి. ఫస్ట్ సింగిల్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. ఇప్పుడు మేకర్స్ 'పరిచయమే..' సాంగ్ రిలీజ్. జిబ్రాన్ ఈ సాంగ్‌ని బ్యూటీఫుల్ లవ్ మెలోడీగా కంపోజ్ చేశారు. సామ్రాట్ అందించిన లిరిక్స్ అందర్నీ అలరిస్తున్నాయి. జిబ్రాన్, అభివి, భృత్త వోకల్స్ లవ్లీ ఫీల్‌ని యాడ్ చేశాయి. ఈ సాంగ్‌లో లీడ్ పెయిర్ జర్నీ హత్తుకునేలా ఉంది. సెల్వరాఘవన్, శ్రద్ధా శ్రీనాథ్, మానస చౌదరి కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో విష్ణు విశాల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటిస్తున్నారు. సాయి రోనక్, తారక్ పొన్నప్ప, మాల పార్వతి, అవినాష్, అభిషేక్ జోసెఫ్ జార్జ్ సహాయక పాత్రల్లో నటిస్తున్నారు. విష్ణు విశాల్ 'ఎఫ్ఐఆర్' చిత్రానికి దర్శకత్వం వహించిన మను ఆనంద్ ఈ చిత్రానికి సహ రచయితగా పనిచేశారు. 'ఆర్యన్' ఈనెల 31న విడుదల కానుంది.



# ఇంటిమేట్ సీన్స్.. అలాంటి రోల్స్‌కు నో

## ధన్య బాలకృష్ణన్

తెలుగులో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి ధన్య బాలకృష్ణన్ హీరోయిన్‌గా మాత్రమే కాదు.. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా పలు డిఫరెంట్ రోల్స్‌తో అభిమానులను మెప్పించింది. ప్రస్తుతం ధన్య హీరోయిన్‌గా కృష్ణ లీల అనే మూవీతో ప్రేక్షకుల ముందుకు రానుంది. దేవన్ హీరోగా వస్తోన్న ఈ మూవీ ట్రైలర్ రిలీజైంది. ఈ సందర్భంగా ఈవెంట్‌కు హాజరైన ధన్య బాలకృష్ణన్ తన కెరీర్, అవకాశాలపై ఆసక్తికర కామెంట్స్ చేసింది. తన కెరీర్ ప్రారంభంలో చాలా ఫీలయ్యేదాన్ని ధన్య బాలకృష్ణన్ తెలిపింది. నేను తీసుకున్న కొన్ని నిర్ణయాల వల్ల చాలా అవకాశాలు కోల్పోయానని పేర్కొంది. గ్లామరస్ రోల్స్‌కు నేను పెట్టుకున్న నిబంధనలే కారణమని తెలిపింది. ఇంటిమేట్ సీన్స్ చేయాల్సిన రోల్స్ ఉంటే కూడా నో చెప్పేదాన్ని అని వెల్లడించింది. ఒక మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చి ఇండస్ట్రీలో ఈ స్థాయిలో ఉన్నానంటే చాలా గర్వంగా ఉందన్నారు. చిన్న చిన్న పాత్రలు చేస్తూ నాకు హీరోయిన్ ఛాన్సులు వచ్చాయంటే నా సక్సెస్ కారణమన్నారు. నా ఫ్యామిలీని ఒప్పించి మరి ఇండస్ట్రీలోకి వచ్చానని ధన్య బాలకృష్ణన్ వెల్లడించారు. కాగా.. ధన్య బాలకృష్ణన్ తాజాగా నటించిన చిత్రం కృష్ణ లీల. దేవన్ స్వీయ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. తిరిగొచ్చిన కాలం.. అనేది ఈ మూవీకి ట్యాగ్‌లైన్. ఈ సినిమాను మహాసేన్ విజువల్స్ బ్యానర్‌లో జ్యోత్స్న నిర్మిస్తున్నారు.



# తొలి భారతీయ సూపర్ షీ సినిమా

"శుక్ర', 'మాటరాని మౌనమిది', 'ఏ మాస్టర్ పీస్' వంటి డిఫరెంట్ సినిమాలతో మూవీ లవర్స్ దృష్టిని ఆకట్టుకుంటున్న దర్శకుడు పూర్వాజ్ 'కిల్లర్' అనే సై-ఫై యాక్షన్ థ్రిల్లర్ మూవీని రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో ఆయన హీరోగా నటిస్తుండటం విశేషం. జ్యోతి పూర్వజ్ హీరోయిన్‌గా కనిపించనున్న ఈ చిత్రంలో విశాల్ రాజ్, దశరథ, చందూ, గౌతమ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఉర్వీష్ పూర్వజ్ సమర్పణలో ఏయు అండ్ ఐ, మెర్జ్ ఎక్స్ ఆర్ సంస్థతో కలిసి థింక్ సినిమా బ్యానర్ పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పూర్వాజ్ ప్రజయ్ కామత్, ఎ.పద్మనాభరెడ్డి కొలాబ్రేషన్‌లో నిర్మాణమవుతున్న రెండవ చిత్రమిది. ఆదివారం ఈ మూవీ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు తుది దశకు చేరుకుంటున్నట్లు మేకర్స్ తెలిపారు. ఇండియా ఫస్ట్ సూపర్ షీ మూవీగా ప్రేక్షకుల్లో ఆసక్తి రేపుతోంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజ్ చేసిన గ్లింప్స్‌కు హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది. మైథాలజీ, సైన్స్ ఫిక్షన్, సూపర్ హీరో..ఇలాంటి ఎలిమెంట్స్‌తో ఈ సినిమా ఆద్యంతం ఆసక్తికరంగా రూపొందుతోంది. త్వరలోనే ఈ సినిమా రిలీజ్ డేట్‌ను మేకర్స్ అనౌన్స్ చేయబోతున్నారు.

Printed, Published, Owned by & Editor: MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, Published From SPOORTHI PUBLICATIONS,
# : 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Telangana - 508001, # : F-7, Cherukuri Mini Towers, Road No.4, Jadges colony, Vanasthalipuram, Hyderabad-500070.
epaper.dharmaganta.com, www.dharmaganta.com, dharmagantasp@gmail.com, +919440994108, +919885826108, +919440828108